Follow: @ANNTELUGU

30-12-2025

ANN తెలుగు

# మహా పత్రిక


మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 6 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## భద్రాద్రిలో పోటెత్తిన భక్తజనం

### వైభవంగా రాములోరి తెప్పోత్సవం

**భద్రాద్రి బ్యూరో, మహా:** రాములోరి తెప్పోత్సవం భద్రగిరిలో వైభవంగా జరిగింది. సీతారామచంద్రస్వామి , అమ్మవారిని హంస వాహనంపై గోదావరిలో ఊరేగించారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా భద్రాచలంలో తెప్పోత్సవం ఘనంగా జరిగింది. కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా బాణాసంచా కాల్చారు. ఆకాశంలో తారా జువ్వలు అంబరాన్ని అంటేవిధంగా చూపరులకు కనువిందు చేశాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నుంచి భక్తులు రావడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున భద్రాచలంకి వచ్చి తెప్పోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. గోదావరి నది పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిట లాడాయి. అంతేకాకుండా సందడి వాతావరణం నెలకొంది. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఇందుకోసం ఇప్పటికే పెద్ద సంఖ్యలో భక్తులు భద్రాచలం చేరుకున్నారు. ముక్కోటి వేడుకల కోసం వేచి చూస్తున్నారు. ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం, దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



**టాప్ న్యూస్**

## నటి మాధవీలతపై కేసు నమోదు

- షిరిడీ సాయిబాబాపై వివాదాస్పద వ్యాఖ్యలు



02

జనవరి 6న లేదా 9న

## డీకే శివకుమార్ ముఖ్యమంత్రి

- రామనగర ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



02

## బడ్జెట్ రూ.710 కోట్లు

- కలెక్షన్లు రూ.19 వేల కోట్లు
- చైనా సినిమా సునామీ



02



## అసెంబ్లీలో బాంబు ప్రకంపనలు

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ శాసనసభ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని మరియు ఒక చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఆయన చేసిన ఆరోపణలు సభను ఉలిక్కిపడేలా చేశాయి. సభలో చర్చ జరుగుతున్న సమయంలో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..

మిగతా 2లో



## ఏపీలో కొత్త జిల్లాలకు కేబినెట్ ఆమోదం

- 28 జిల్లాలుగా ఖరారు చేసిన మంత్రివర్గం
- కొత్త జిల్లాలు మార్కాపురం, మదనపల్లి, రంపచోడవరం
- మధనపల్లిలో విలీనం కానున్న రాయచోటి జిల్లా
- కొన్ని జిల్లాల సరిహద్దుల మార్పు

02

# సీఎం రేవంత్ ఆత్మీయత

## కేసీఆర్‌ను చూడగానే.. కూర్చున్న చోటికెళ్ళి నమస్కారం

బాగున్నారా.. ఆరోగ్యం ఎలా ఉంది? అంటూ వాకబు

నమస్కారం చేసి.. కరచాలనం అందించిన కేసీఆర్

రేవంత్ ది పాలమూరు ప్రేమతత్వమంటూ ప్రశంసలు

నాడు అంద్రేశ్ వద్ద.. నేడు కేసీఆర్ వద్ద.. మనసు గెలిచావ్ రేవంతన్న అంటూ వ్యాఖ్యలు

సభలో సంభ్రమం.. 2 నిమిషాలకే సభ నుండి వెళ్ళిపోయిన కేసీఆర్

నెట్టింట.. బయటా అంతా ఇదే చర్చ



**హైదరాబాద్ -మహా:**

సభలో ఓ ఆకట్టుకునే సన్నివేశం. అది ఆకస్మికంగా అలా జరిగిపోయిందంతే. పక్క రాష్ట్రంలో కనపడని ఆత్మీయత.. అపూర్వ ఘట్టం తెలంగాణ అసెంబ్లీలో కనిపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష స్థానంలో కూర్చున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు తానే స్వయంగా వెళ్ళి నమస్కారం చేయడంతో పాటు కరచాలనం అందించారు. కేసీఆర్ కూడా సభా నాయకుడిని చూసి అంతే గౌరవంగా లేచి నిలబడి స్పందించారు. కరచాలనం అందించారు. బాగున్నారా.. ఆరోగ్యం ఎలా ఉంది? అంటూ సీఎం రేవంత్ ఈ సందర్భంగా పలకరించారు. ఈ దృశ్యం తెలుగు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ రాజకీయాల్లో సందర్భాన్ని బట్టి దూషించుకున్నా, ఆవేశపడ్డా పగలు.. ప్రతీకారాలు ఉండవని మరోసారి రుజువైంది.

మిగతా 2లో



## కేసీఆర్‌కు రేవంత్ పలకరింపుపై కేటీఆర్ రియాక్షన్ ఇదే

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం ఉదయం అసెంబ్లీకి రాగా, సభలో తన సీటులో కూర్చున్న కేసీఆర్ వద్దకు వెళ్లి మరీ సీఎం రేవంత్ రెడ్డి పలకరించడం, ఆయనతో కరచాలనం చేసి ఆరోగ్యం గురించి వాకబు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ ఘటనపై

మిగతా 2లో

జనవరి 2 నుంచి 7 వరకు తెలంగాణ

## అసెంబ్లీ సమావేశాలు

### బీఏసీ సమావేశం అనంతరం స్పీకర్ నిర్ణయం

తొలిరోజు రెండు గంటలు సాగిన శాసనసభ



**హైదరాబాద్ మహా:** శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఇటీవల మరణించిన దివంగత మాజీ ఎమ్మెల్యే, మండలి సభ్యులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం పలు ఆర్డినెన్స్ లను ఉభయసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్‌ను కొనసాగించగా పలువురు సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ ( సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ లు హాజరయ్యారు. మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ పనిదినాలు ఎజెండాను ఈ సమావేశంలో ఖరారు చేశారు.

**15 రోజులు సమావేశాలు జరపాలి**

బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుపట్టామని వివరించారు. వారం రోజులు జరిపి మళ్లీ బీఏసీ పెడతామని స్పీకర్ చెప్పారన్న హరీశ్‌రావు అసెంబ్లీలో పీపీటీ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించామని భట్టి విక్రమార్క అన్నారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు మీరు ఇవ్వకపోతే మేము బాయ్ కాట్ చేయాలా అని అడిగామన్నారు.

తెలంగాణ పోలీస్ కమిషనరేట్ల


## పునర్ వ్యవస్థీకరణ

- రాష్ట్రంలో నాలుగు పోలీస్ కమిషరేట్లు
- ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్ బాబు
- రాచకొండలో మార్పులు చేర్పులు.. మల్కాజ్ గిరి కమిషనరేట్
- ప్రత్యేక జిల్లాగా యాదాద్రి.. ఎస్సీ నియామకం




**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణపై కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేసింది. సైబరాబాద్ సీపీగా రమేశ్ రెడ్డి, మల్కాజ్‌గిరి సీపీగా అవినాశ్ మహంతి, ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్ బాబు, యాదాద్రి ఎస్పీగా ఆకాంక్ష్ యాదవ్‌లను నియమిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది.

మిగతా 2లో



## 20 రోజులు సభ జరపాలి

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి

**హైదరాబాద్ , మహా :** శాసనసభ సమావేశాలు కనీసం 20 రోజులైనా నిర్వహించాలని సభాపతిని కోరామని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరినట్లుగా వివరించారు. జనవరి 2 నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని వివరించారు. జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు. 2 రోజులు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకోవటం సరికాదని వివరించారు.



## నీటి పారుదల రంగంపై పీపీటీ

### మంత్రి శ్రీధర్ బాబు

శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభ శీతాకాల సమావేశాలు ఇరవై రోజులు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్టు చెప్పారు. చివరకు స్పీకర్ ఏడు రోజులు సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బీఏసీ భేటీకి ముందు స్పీకర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నీటిపారుదలకు సంబంధించిన అంశాలపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం కల్పించినప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కు ఇవ్వాలని కోరారు.

రెండు గంటల పాటు

## అసెంబ్లీ

- జీరో అవర్ లో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాపం

02



అమెరికాలో ఘోర రోడ్డు

## ప్రమాదం

తెలంగాణకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం

వివరాలు 2లో

వెండి ధరల పెరుగుదలపై

## ఎలాన్ మస్క్ వర్రీ

పారిశ్రామిక అవసరాలకు వెండి చాలా ముఖ్యం

వివరాలు 2లో

## జనవరి 6న లేదా 9న డికె శివకుమార్ సీఎం

**రామనగర ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

**మహా:** వచ్చే సంవత్సరం జనవరి 6 లేదా 9వ తేదీన డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రామనగర ఎమ్మెల్యే పలు సందర్భాలలో శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని చెబుతున్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి. "ఆయన (డి.కె.శివకుమార్) తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారు. దీనిని నేను 200 శాతం కచ్చితంగా చెబుతున్నాను. ఈ విషయాన్ని నాకు నేనుగా చెప్పడం లేదు. కొంతమంది ముఖ్యమైన వ్యక్తులు చెప్పడంతో నేను ఈ ప్రకటన చేస్తున్నాను" అని ఆయన స్పష్టం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని ఆయన అన్నారు. 2026 జనవరి 6న లేదా 9న డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అయితే ఏం జరుగుతుందో చూడాలని, తనకైతే పూర్తి నమ్మకం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# సీఎం రేవంత్ ఆత్మీయత

(మొదటిపేజీ తరువాయి)



తెలంగాణ రాజకీయాల్లో ఉన్న అద్భుతం ఇదేనని, రేవంత్ లో పాలమూరు ప్రేమతత్వం ఉందని అంటూ ప్రశంసలు వెల్లువెత్తాయి. నాడు అందెశ్రీ మరణించిన సందర్భంలో ముఖ్యమంత్రిగా ఉండి కూడా పాడెమోసి అందరినీ ఆశ్చర్యపరిచిన రేవంత్ రెడ్డి సోమవారం సభలో కూర్చున్న కేసీఆర్ వద్దకు కూడా వెళ్ళి అదే ఆత్మీయత, ప్రేమ, పెద్దలపై గౌరవభావం ప్రదర్శించారు. సభా నాయకుడిగా సీఎం వెళ్ళిన సమయంలో మాజీ మంత్రులు తలసాని, హరీష్ రావు, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిలు కూడా తిరిగి అభివాదం చేశారు. సభలో తొలిరోజు ఆత్మీయ వాతావరణం కనిపించింది. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. 3 నిమిషాలు సభలో ఉన్న కేసీఆర్ ఇలా వచ్చి అలా వెళ్ళారన్న చర్చ బాగా జరిగింది. అసెంబ్లీలో హాజరు సంతకం పెట్టేందుకే వచ్చారని పలువురు కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాగా నెట్టింట.. బయట అంతా కేసీఆర్ హాజరు, సీఎం రేవంత్ కరచాలన అంశాలపైనే బాగా చర్చ జరిగింది.

**మేమిద్దరం మాట్లాడుకుంది మీకెందుకు చెబుతా?**

మాజీ సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఇవాళే కాదు, ఆస్పత్రిలో కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో ఆయన్నే అడగాలని అన్నారు. ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి ఆయన మేమిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతాం? అని వ్యాఖ్యానించారు. కరచాలనం చేస్తూ బాగున్నారా అని రేవంత్ రెడ్డి పలకరించారు.

**మండలి భవనం రెడీ**

బడ్జెట్ సమావేశాల నాటికి అసెంబ్లీ ఆవరణలోని భవనంలో శాసనమండలి సమావేశాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. అసెంబ్లీ ఆవరణలోని భవనంలో జరుగుతున్న మరమ్మతులను మండలి ఛైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డితో కలిసి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులు, జరగాల్సిన ప్రణాళికలపై అధికారులతో చర్చించిన సీఎం పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మంత్రుల ఛాంబర్లు ఉన్న ప్రాంతంలో పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో సెంట్రల్ హాల్ నిర్మించనున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. సెంట్రల్ హాల్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అతిథులకు ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు.

**మంత్రులు సమాయత్తం కావాలి**

బీఆర్ఎస్ పార్టీకి కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సమాయత్తం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పార్టీ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంత్రులతో రేవంత్ రెడ్డి భేటీ నిర్వహించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని సూచించారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యమని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతీ అంశానికి సమాధానం ఇవ్వాలని తెలిపారు.

## ఏపీలో కొత్త జిల్లాలకు కేబినెట్ ఆమోదం



- **28 జిల్లాలుగా ఖరారు చేసిన మంత్రివర్గం**
- **కొత్త జిల్లాలు మార్కాపురం, మదనపల్లి, రంపచోడవరం**
- **మధనపల్లిలో విలీనం కానున్న రాయచోటి జిల్లా**
- **కొన్ని జిల్లాల సరిహద్దుల మార్పు**

**అమరావతి, మహా :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ మంత్రివర్గం మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం అనే మూడు కొత్త జిల్లాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. తుది గెజిట్ నోటిఫికేషన్ రెండు, మూడు రోజుల్లో విడుదల కానుంది. సమావేశంలో పలు కీలక మార్పులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యాలయంగా ఉన్న రాయచోటి, కొత్తగా సృష్టించిన మదనపల్లె జిల్లాలో విలీనం అవుతుంది. రాజంపేట కడప జిల్లాలో కలుస్తుంది. రైల్వే కోడూరు తిరుపతి జిల్లాలో భాగమవుతుంది. గూడూరును తిరుపతి జిల్లా నుండి తిరిగి నెల్లూరు జిల్లాకు కలిపేస్తారు. ఐదు కొత్త రెవెన్యూ డివిజన్లకు కూడా ఆమోదం లభించింది. అనివార్య పరిస్థితుల కారణంగా, విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పునర్వ్యవస్థీకరణ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా వివరించారు. ఆదోనిలో మూడు కొత్త మండలాలను సృష్టించాలనే ప్రతిపాదనలో, రెండింటికీ మాత్రమే ఆమోదం లభించింది. నెల్లూరు జిల్లా రెవెన్యూ డివిజన్, డీఎస్పీ అధికార పరిధి వేర్వేరు ప్రదేశాలలో ఉన్నందున చర్చ నడిచింది. నెల్లూరులో పరిపాలనా సమస్యలపై చర్చలు జరిగాయి. 2025లో ఎన్నో సంస్కరణలకు నాందిగా చంద్రబాబు ప్రకటించారు. 2026లో అధికారులు తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. రెండు మూడు రోజుల్లో కొత్త జిల్లాలపై గెజిట్ నోటిఫికేషన్ రానుంది. దీనితో జిల్లాల మార్పులు అధికారికంగా అమల్లోకి వస్తాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు స్థానిక అభివృద్ధి, పాలనా సమన్వయానికి కీలకంగా మారుతాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మార్పులు, చేర్పులు జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉంటుంది.. అయితే జిల్లా కేంద్రం మాత్రం మదనపల్లె ఉంటుంది.

## బడ్జెట్ రూ.710 కోట్లు

**కలెక్షన్‌లు రూ.19 వేల కోట్లు**

**చైనా సినిమా సునామీ**

**మహా:** ప్రపంచ బాక్సాఫీస్‌ను ఒక చైనా యానిమేషన్ చిత్రం 2025 సంవత్సరంలో శాసించింది. 'నే ఝా 2' పేరుతో వచ్చిన ఈ సినిమా, ఏకంగా 2.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19 వేల కోట్లు) వసూలు చేసి ఈ ఏడాది ప్రపంచంలోనే అతిపెద్ద హిట్‌గా అవతరించింది. హాలీవుడ్ భారీ చిత్రాలను సైతం వెనక్కి నెట్టి ఈ ఘనత సాధించడం విశేషం. 2019లో భారీ విజయం సాధించిన 'నే ఝా' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమాను చైనా పురాణాల ఆధారంగా తెరకెక్కించారు. విధిని ఎదిరించి నిలిచిన ఓ బాలుడి కథతో ఫాంటసీ అడ్వెంచర్‌గా రూపొందించారు. కేవలం రూ.710 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం, మాండరిన్ భాషలో విడుదలై ఆ తర్వాత ఇంగ్లిష్, హిందీ వంటి భాషల్లోకి డబ్ అయింది. ఈ ఏడాది జనవరిలో చైనాలో, ఏప్రిల్‌లో భారత్‌లో విడుదలైంది. ఈ భారీ విజయంతో 'నే ఝా 2' ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో ఐదో స్థానానికి చేరింది. 'అవతార్', 'అవెంజర్స్: ఎండ్‌గేమ్', 'అవతార్ 2', 'టైటానిక్' వంటి దిగ్గజ చిత్రాల తర్వాత ఇది నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమా ఆపిల్ టీవీ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. భారతీయ సినిమాల్లో ఈ ఏడాది 'ధురంధర్' వంటి చిత్రాలు భారీ వసూళ్లు సాధించినా, ప్రపంచ స్థాయిలో 'నే ఝా 2' దరిదాపుల్లోకి రాలేకపోయాయి.

## ఉక్రెయిన్‌కు అమెరికా 15 ఏళ్ల పాటు భద్రత హామీ

**50 ఏళ్లు ఇస్తే బాగుంటుందన్న జెలెన్‌స్కీ**

**మహా :** శాంతి ఒప్పంద ప్రణాళికలో భాగంగా అమెరికా, ఉక్రెయిన్‌కు 15ఏళ్ల పాటు భద్రత హామీని ప్రతిపాదించినట్లు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. అయితే రష్యా భూఆక్రమణను నిరోధించేందుకు ఉక్రెయిన్‌కు 50 ఏళ్ల పాటు అమెరికా భద్రత ఉంటే బాగుంటుందన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగించేందుకు కీలక అంశాలపై చర్చల్లో పురోగతిని అమెరికా వెతుకుతోంది. ఇందులో భాగంగా జపోరిజియా అణు విద్యుత్ కేంద్రం సహా ఆక్రమించుకున్న భూ భాగాల నుంచి సైన్యాలను రష్యా, ఉక్రెయిన్ ఉపసహరించుకోవాలి. అమెరికా నేతృత్వంలో నెలల తరబడి జరుగుతున్న రష్యాఉక్రెయిన్ శాంతి చర్చలు ఎన్నడూ లేని విధంగా సమీపానికి వచ్చాయని ట్రంప్ అన్నారు. అయితే, ఈ చర్చలు విఫలమయ్యే అవకాశం కూడా ఉందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. భద్రత హామీలు లేకుండా రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగియదని జెలెన్‌స్కీ తెలిపారు. ఆదివారం ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లోని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ కోసం 20 అంశాల శాంతి ప్రతిపాదన గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు తెలియజేశారని, దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ చర్చించారన్నారు. యుద్ధం ముగింపునకు జెలెన్‌స్కీ కోరుతున్న భద్రత హామీలు ఇప్పటి వరకూ బహిర్గతం కాలేదు. కానీ, శాంతి ఒప్పందాన్ని పర్యవేక్షించడం, భాగస్వాములు కావడం వంటి అంశాలు అందులో ఉన్నాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.



కేసీఆర్ కు రేవంత్ పలకరింపుపై

## కేటీఆర్ రియాక్షన్ ఇదే

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని, అయితే ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే ఇంకా బాగుంటుందని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదేనని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గౌరవం ఉందని కేటీఆర్ చెప్పారు.

**రేవంత్ తిట్లే నాకు దీవెనలు**

పాలమూరురంగారెడ్డి విషయంలో రంధ్రాన్వేషణ మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు పలికారు. కేసీఆర్ కు మంచి పేరు వస్తుందనే పాలమూరురంగారెడ్డి పనులను ప్రభుత్వం చేయటంలేదని ఆరోపించారు. దీనివల్ల అంతిమంగా రాష్ట్రానికే నష్టమని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలని అన్నారు. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారని చెప్పారు. రేవంత్ రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే నన్ను తిడుతున్నారు.. ఆయన తిట్లే నాకు దీవెనలు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'నన్ను తిడితే పడతానేమో కానీ.. కేసీఆర్‌ను అంటే మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

**తెలంగాణకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం**

**హైదరాబాద్, మహా :** అమెరికాలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు యువతులు దుర్మరణం చెందారు. చదువు, భవిష్యత్ ఆశలతో విదేశాలకు వెళ్లిన యువతులు ఇలా అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాలను శోకసంద్రంలో ముంచింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన పులఖండం మేఘనారాణి (25), కరీంనగర్ జిల్లా ముల్కనూరు ప్రాంతానికి చెందిన కడియాల భావన (24) మూడేళ్ళ క్రితం ఎంఎస్ చదవడానికి అమెరికా వెళ్లారు. ఇటీవలే ఎంఎస్ పూర్తి చేసిన వారు ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరూ తమ స్నేహితులతో కలిసి రెండు కార్లలో కాలిఫోర్నియాకు విహారయాత్రకు వెళ్లారు. టూర్ ముగించుకొని తిరిగి వస్తున్న సమయంలో, మేఘనారాణి, భావన ప్రయాణిస్తున్న కారు అలబామా హిల్స్ ప్రాంతంలోని ప్రమాదకరమైన మలుపు వద్ద అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తీవ్రంగా కలతకు గురయ్యారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తమ కుమార్తెల మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, బంధువులు కుటుంబాలను పరామర్శిస్తూ సంతాపం తెలియజేస్తున్నారు. ఈ ఘటనపై అమెరికా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు.

## నటి మాధవీలతపై కేసు నమోదు

**షిరిడీ సాయిబాబాపై వివాదాస్పద వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా :** ప్రముఖ సినీ నటి మాధవీలతపై హైదరాబాద్‌లోని సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షిరిడీ సాయిబాబా దేవుడు కాదంటూ ఆమె సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. మాధవీలతతో పాటు ఈ వివాదాన్ని ప్రోత్సహించిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. గత కొద్దికాలంగా సామాజిక, రాజకీయ అంశాలపై సోషల్ మీడియాలో చురుగ్గా స్పందిస్తున్న మాధవీలత, ఇటీవల సాయిబాబాను ఉద్దేశించి కొన్ని పోస్టులు పెట్టారు. ఈ వ్యాఖ్యలు సాయిబాబా భక్తుల నమ్మకాలను కించపరిచేలా ఉన్నాయని కొందరు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు, మాధవీలతతో పాటు ఆమెకు మద్దతుగా ఇంటర్వ్యూలు చేసి, వీడియోలు ప్రచారం చేసిన వారిపైనా కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని నిందితులందరికీ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని ఇతరుల నమ్మకాలను కించపరిచినా లేదా అసత్య ప్రచారాలు చేసినా ఐటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యూస్ కోసం వివాదాలను ప్రోత్సహించే యూట్యూబ్ ఛానెళ్లపై కూడా దృష్టి సారించినట్లు తెలిపారు.

## వెండి ధరల పెరుగుదలపై ఎలాన్ మస్క్ వర్రీ

**పారిశ్రామిక అవసరాలకు వెండి చాలా ముఖ్యం**

**మహా:** ప్రపంచ మార్కెట్లలో వెండి ధరలు జెట్ స్పీడ్‌లో పరుగులు పెట్టడంపై టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక అవసరాలకు వెండి చాలా కీలకమైందని, అయితే ఈ స్థాయిలో ధరలు పెరగడం మంచిది కాదని ఆయన హెచ్చరించారు. "ఇది మంచిది కాదు. అనేక పారిశ్రామిక ప్రక్రియలకు వెండి అవసరం" అని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీలో వెండిని ఎక్కువగా వినియోగిస్తారు. టెస్లా అధినేత అయిన మస్క్ ఆందోళన వెనుక ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సోమవారం అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర ఔన్సుకు 79 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అంతకుముందు స్పాట్ మార్కెట్లో ఏకంగా 84 డాలర్ల రికార్డు స్థాయిని తాకి, లాభాల స్వీకరణ కారణంగా 8 శాతం మేర పడిపోయింది. అయినప్పటికీ ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి సుమారు 158 శాతం పెరిగింది. పారిశ్రామిక డిమాండ్ విపరీతంగా పెరగడం, సరఫరాలో కొరత, స్పెక్యులేటివ్ పెట్టుబడులు వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని విశ్లేషకులు చెబుతున్నారు. సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లలో వెండి వాడకం పెరగడంతో నిల్వలు తగ్గుతున్నాయి.

## మునిసిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

- **ఓటర్ జాబితా సవరణకు నోటిఫికేషన్**
- **ఫిబ్రవరిలో ఎన్నికల ముహూర్తం**
- **117 మునిసిపాలిటీలు.. 6 కార్పోరేషన్లు రెడీ**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికల నగారా మోగనుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఓటర్ జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 30వ తేదీ నుంచి 2026 జనవరి 10వ తేదీ వరకు ఓటరు జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు చేయనుంది. 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల(నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, రామగుండం)లో ఓటర్ జాబితా తయారీ ప్రక్రియ జరగనుంది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి పట్టణ స్థానిక సంస్థలకు దాదాపు రూ.700 కోట్ల నిధులు రావాల్సి ఉంది. వీటిని సాధించుకోవాలంటే వచ్చే మార్చిలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి చివర్లో పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలనలో మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. వచ్చే ఫిబ్రవరితో జీహెచ్ఎంసీ పాలకవర్గం, వచ్చే మే నెలతో వరంగల్, ఖమ్మం, సిద్ధిపేట, అచ్చంపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరేకల్‌లాంటి పాలకవర్గాల గడువు ముగియనుంది. దీంతో వీటన్నంటిని ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తారా? లేక గతంలో లాగానే విడివిడిగా ఎన్నికలు నిర్వహిస్తారా? అనేది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. తాజాగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన కసరత్తును ఎన్నికల సంఘం ప్రారంభించడంతో అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. జనవరి ఆఖర్లో లేదా ఫిబ్రవరి మొదటివారంలో నోటిఫికేషన్ వచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

## నవీన్ యాదవ్‌కు షాక్

**ఎన్నికపై హైకోర్టులో పిటిషన్**



**మహా:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ ప్రత్యర్థి మాగంటి సునీత తెలంగాణ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. నామినేషన్ లో సమర్పించిన అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇచ్చారని పిటిషన్ లో రాశారు. ప్రచార పర్వం లోను ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని అన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాగంటి సునీతా గోపినాథ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## తెలంగాణ పోలీస్ కమిషనరేట్ల పునర్ వ్యవస్థీకరణ

(మొదటిపేజీ తరువాయి)




పునర్ వ్యవస్థీకరించిన జీహెచ్ఎంసీతో పాటు ఫ్యూచర్ సిటీతో కలిపి పోలీస్ వ్యవస్థను నాలుగు కమిషనరేట్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న మూడు కమిషనరేట్లను పునర్ వ్యవస్థీకరిస్తూ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, బేగంపేట, శంషాబాద్ ఎయిర్ పోర్టు, బుద్వేల్ హైకోర్టు లాంటి కీలక ప్రాంతాలను హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ ప్రాంతాలు గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్ రామ్ గూడ, మాదాపూర్, రాయదుర్గ్, పారిశ్రామిక ప్రాంతాలు పటాన్ చెరు, జీనోమ్ వ్యాలీ, ఆర్ సి పురం, అమీన్ పూర్ తదితర ప్రాంతాలు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండనున్నాయి. సీఎం ఆదేశాల మేరకు డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కీలక సమావేశాలు నిర్వహించి మార్పుచేర్పులకు సంబంధించి తుది ప్రతిపాదనలు రూపొందించారు. ఆదివారం నిర్వహించిన సమావేశానికి పురపాలక, పోలీసు శాఖ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. సీఎం ఆమోదంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**మల్కాజ్ గిరి కమిషనరేట్**

రాచకొండ కమిషనరేట్‌ను పునర్ వ్యవస్థీకరించి మల్కాజ్ గిరి పేరుతో కొత్త కమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. కీసర, శామీర్ పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి తదితర ప్రాంతాలు ఈ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయి. ఇప్పటివరకు రాచకొండ పరిధిలో ఉన్న భువనగిరిని ప్రత్యేక పోలీస్ యూనిట్‌గా ఏర్పాటు చేసి యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమించారు.

**ఫ్యూచర్ సిటీ కమిషనరేట్**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ కోసం కొత్త కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్ పల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాలు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి తీసుకు వచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనాలుగు కమిషనరేట్లకు పోలీస్ కమిషనర్లను, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎస్పీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## అసెంబ్లీలో బాంబు ప్రకంపనలు

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం**

(మొదటిపేజీ తరువాయి)



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ తరహాలోనే తన నియోజకవర్గ పరిధిలోని తనుగుల చెక్‌డ్యాంను కూడా బాంబు పెట్టి పేల్చేశారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికే ఇలా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా విరుచుకుపడ్డారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇతర సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి, బాంబులు పెట్టి పేల్చారు అనే పదజాలాన్ని ఎలా వాడతారని వారు ప్రశ్నించారు. సభలో అశాంతిని ప్రేరేపించే విధంగా ఉన్న కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను వెంటనే అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు ఎన్నికల సమయంలో కుంగిపోయాయి. అది నిర్మాణ లోపం కారణంగానే కుంగిపోయిందని నిపుణులు నివేదిక ఇచ్చారు. ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశం కావడంతో పాడి కౌశిక్ రెడ్డి పేల్చేశారన్న ఆరోపణలను తెరపైకి తెచ్చారు. సభలో మర్యాదపూర్వక పదజాలం వాడాలని, నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని అధికార పక్షం హెచ్చరించింది. ఈ పరిణామాలతో సభలో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

## రెండు గంటల పాటు అసెంబ్లీ

**జీరో అవర్ లో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యేలు**

**మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాపం**



**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తొలిరోజున దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాపం తెలిపింది. అనంతరం స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. శాసన మండలిలో మాజీ ఎమ్మెల్సీలు మాధవరం జగపతిరావు, అహ్మద్ పీర్ షబ్బీర్‌లకు సంతాపం ప్రకటించారు. అనంతరం బీఎస్టీ సవరణల ఆర్డినెన్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మొదటి, రెండో సవరణల ఆర్డినెన్స్‌లు, పురపాలక సంఘాల సవరణల ఆర్డినెన్స్, తెలంగాణ సమగ్ర శిక్షా ఆడిట్ నివేదిక, పీఎం స్కూల్ రైజింగ్ ఇండియా ఆడిట్ రిపోర్ట్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణల ఆర్డినెన్స్‌లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణల ఆర్డినెన్స్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఉభయసభల్లో ప్రవేశ పెట్టారు. ఆయా ఆర్డినెన్స్‌ల ద్వారా తెచ్చిన సవరణలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రస్తుత సమావేశాల్లో బిల్లులు ప్రవేశ పెట్టనున్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు చెందిన సభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు రెండు గంటల పాటు శాసనసభ సాగింది.

## రాగ్యానాయక్ 24వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన సేవాలాల్ అధ్యక్షులు బానోతు తులసి రామ్



**హుజూర్ నగర్ మహా :** హుజూర్ నగర్ పట్టణంలోని టౌన్ హాల్ యందు సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా స్వర్గీయ ధీరావత్ రాగ్యానాయక్ 24వ వర్ధంతి సందర్భంగా దివ్య శృతిని స్మరించుకుంటూ హుజూర్ నగర్ నియోజకవర్గ సేవాలాల్ అధ్యక్షులు బానోతు తులసి రామ్ నాయక్ అధ్యక్షతన ఘన నివాళులు అర్పించడం జరిగింది.గిరిజన జాతి కోసం అహర్నిశలు పాటుపడి సేవా మార్గాన్ని ఎంచుకొని గిరిజన జాతి ఖ్యాతిని ఉనికిని చాటి జనహృదయ విజేతగా నిలిచారు వారికి ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తేజావత్ రవి నాయక్ మాజీ సర్పంచ్ బానోతు వీటి నాయక్ తేజావత్ సైదులు నాయక్ జాబ్లా తండ గ్రామ సర్పంచు బానోతు భాస్కర్ నాయక్ కింది తండా సర్పంచ్ మాలోతు జ్యోతి శ్రీను నాయక్ చెన్నై పాలెం సర్పంచ్ భూక్య రవీందర్ నాయక్ మంచా తండా సర్పంచ్ మాలోతు బాబు నాయక్ తుమ్మల తండా సర్పంచ్ సౌదాసు శీను నాయక్ గుర్రంపోడు తండా సర్పంచ్ మూడవత్ యాంకు నాయక్ భీమ్లా తండా సర్పంచ్ నాగు నాయక్ కామాచికుంట తండా సర్పంచ్ ధరావత్ గోవింద నాయక్ బిలియా నాయక్ తండ సర్పంచ్ బానోతు రాముడు నాయక్ లచ్చా తండా సర్పంచ్ వాగుడోత్ రవి నాయక్ సిరి హాస్పిటల్ ఎండి నాగు నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోతు సైదా నాయక్ మాజీ ఎంపీటీసీ రాములు నాయక్ బంగియ నాయక్ ఏస్జీఓ ప్రెసిడెంట్ వాంకుడోత్ గోవిందు నాయక్ మాజీ సర్పంచ్ భూక్య నాగు నాయక్ ఉపసర్పంచ్ మూడు నాగేశ్వరరావు వడిత్య వస్త్ర నాయక్ శంకర్ నాయక్ యువ నాయకులు బిక్షం నాయక్ మగతా నాయక్ గుర్రంపోడు లిఫ్ట్ చైర్మన్ నాగు నాయక్ మోహన్ నాయక్ భూక్య కొండ నాయక్ చెన్నై పాలెం యువ నాయకులు బజ్జు నాయక్ అడ్వకేట్ వెంకటేష్ నాయక్ మొదలైన వారు పాల్గొని గిరిజన జాతి ముద్దుబిడ్డ ఆయన రాగ్యా నాయక్ కి ఘన నివాళులర్పించడం జరిగింది.

## చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

**వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్**



**వలిగొండ, మహా :** నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ అన్నారు సోమవారం మహా న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గాలిపటాల ఎగరవేతకు యువత సిద్ధమవుతున్న తరుణంలో ప్రమాదకరమైన చైనా మాంజా వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు చైనా మాంజా వినియోగం వల్ల ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడే అవకాశం ఉన్నందున ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉన్నదని అన్నారు మాంజాను ఎవరైనా విక్రయించిన లేదా వినియోగించిన చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు నిషేధిత చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వట్టి మాటలేనా?

**వలిగొండ, మహా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వట్టి మాటలేనా అని మలిదశ ఉద్యమకారుడు. ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి అధికారంలోకి రావడానికి క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు నేటి వరకు హామీలు అమలు చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు వెంటనే హామీలను అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు

## బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ కేటీఆర్ ను కలిసిన కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి





**కరీంనగర్, మహా :** బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావును సోమవారం హైదరాబాదులో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ కు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి కెసిఆర్ కేటీఆర్ తో పలు అంశాలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మానకొండూరు నియోజకవర్గంలో అత్యధికంగా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారని వారి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికీ గ్రామాల్లో పార్టీ పటిష్టంగా బలంగా ఉందని బిఆర్ఎస్ పట్ల ప్రజలంతా సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై రోజు రోజుకు తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నదని ప్రజలే వారి పాలనను చూసి చిత్కరిస్తున్నారని కెసిఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్పబోతున్నారని వివరించారు. మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా టిఆర్ఎస్ విజయ డంక ముగించాలని గ్రామ గ్రామానా గులాబీ జెండా రెపరెపలాడాలని కెసిఆర్ కేటీఆర్ దేవేందర్ రెడ్డి కి సూచించారు. ఇందుకోసం పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని వారు పేర్కొన్నారు.

## శంకర్పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్కతల సురేందర్ గౌడ్ ఏకగ్రీవం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** శంకర్పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా, పర్వేద గ్రామ సర్పంచ్ ఎన్కతల సురేందర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు ఏకాభిప్రాయంతో ఆయనను సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సురేందర్ గౌడ్ మాట్లాడుతూ... తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. శంకర్పల్లి మండలంలోని ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి సాధించేలా సర్పంచులందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. గ్రామాల మధ్య సమన్వయం పెంచి, స్థానిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో సర్పంచుల సంఘం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధుల కేటాయింపులు, అభివృద్ధి పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను సమిష్టిగా పరిష్కరించేందుకు సర్పంచులందరితో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా సర్పంచులందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా, రాజకీయాలకు అతీతంగా సర్పంచుల సంఘాన్ని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని సురేందర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామస్థాయి నాయకులు పాల్గొని సురేందర్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో శంకర్పల్లి మండలంలోని గ్రామాల అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందన్న ఆశాభావాన్ని సభ్యులు వ్యక్తం చేశారు.

## ప్రతి భారతీయుడు తప్పక చూడాల్సిన సినిమా

# అఖండ తాండవం

**బండి సంజయ్ ప్రశంస.. దర్శకుడు బోయపాటితో కలిసి ప్రసాద్ ల్యాబ్స్ లో సినిమా చూసిన కేంద్ర మంత్రి**





**హైదరాబాద్, మహా :** ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అఖండ 2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని చెప్పారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్ ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. ప్రసాద్ ల్యాబ్స్ లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి అఖండ 2 తాండవం సినిమాను బండి సంజయ్ వీక్షించారు. అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, అఖండ 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉందన్నారు. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారన్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లున్నారన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా ఇది అని అన్నారు. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యముండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమేనని అన్నారు. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా సినిమా అఖండ తాండవం అని ప్రశంసించారు. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే, ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలన్నారు. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పేనని, అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవాడే గొప్ప. అని అన్నారు. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడిపై ఉందని చెప్పారు. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలనే సినిమా అఖండ. భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశమని, కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే.... సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే.. ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ద్రుశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్ ను పాలిస్తున్నాడు కాబట్టే వ్యాక్సిన్ ను అందించగలిగామన్నారు. సైంటిస్టులను ప్రోత్సహించామని, కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్ లో ఉందన్నారు. మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్ ను పరీక్షించారని సంజయ్ గుర్తు చేశారు. బోయపాటి శ్రీనివాస్ దర్శకత్వంలో బాలక్రిష్ణ అద్భుతంగా నటించారన్నారు. బాలయ్య సినిమాల కోసం విద్యార్థులు, కాలేజీలు, యువకులు బెట్టింగులు పెట్టి మరీ వెళుతున్నారు. ఎన్టీఆర్ రూపంలో బాలయ్యను చూస్తున్నాం. అఖండ సినిమాలో బాలయ్యను చూస్తే శివుడే మన ముందు కన్పించినట్లుంది. అఖండ సినిమాను లీనమై చూశాం. ఎక్కడా రాజీపడకుండా అఖండ 2 సినిమా చూసిన బోయపాటి శ్రీనుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సినిమాను అందరం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలి. ఈ దేశంలో అంతర్గతంగా జరుగుతున్న దాడులను, పరిస్థితులను ఆసరాగా చేసుకుని సినిమాలు తీసి ప్రజలను మేల్కొల్పాల్సిన అవసరం ఉంది. కొంత మంది ధర్మం విషయంలో దారి తప్పుతున్నారు. దేవుడు లేడు, హిందూ సనాతన ధర్మం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారందరికీ అఖండ 2 సినిమా గుణపాఠం. అటు ఇటు దారి తప్పిన వాళ్లంతా హిందూ ధర్మమనే గొడుగు కిందకు రావాలని కోరుతున్నానన్నారు.

# చైనా మాంజా

**ఆచూకి చెబితే అయిదు వేల నజరానా..**

**సంక్రాంతి వేళ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం ప్రకటన**



**హైదరాబాద్, మహా :** సంక్రాంతి పండుగ వేళ పతంగుల కోసం చైనా మాంజా వాడకాన్ని అరికట్టేందుకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాణాంతక దారం వల్ల పక్షులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే చైనా మాంజా విక్రయిస్తున్న వారి సమాచారం అందిస్తే తన సొంత నిధుల నుంచి ఐదు వేల రూపాయల నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. పర్యావరణాన్ని, ప్రాణాలను కాపాడేందుకు ఎమ్మెల్యే తీసుకున్న ఈ వినూత్న నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ప్రశంసిస్తున్నారు.సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఆకాశం రంగురంగుల పతంగులతో నిండిపోతుంది. అయితే ఈ ఆనందం వెనుక 'చైనా మాంజా' రూపంలో ఒక పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గంలో చైనా మాంజా విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ఆయన ఒక వినూత్నమైన బహుమతిని ప్రకటించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే.. ఆ సమాచారాన్ని తనకు లేదా అధికారులకు అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఇలా నిజమైన సమాచారం అందించిన వారికి తన సొంత నిధుల నుండి 5,000 రూపాయల నగదు బహుమతిని అందజేస్తానని ఆయన వెల్లడించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై పోలీసుల ద్వారా కఠినమైన కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

### చైనా మాంజా ఎందుకు ప్రమాదకరం..?

చైనా మాంజా అనేది సాధారణ దారం కాదు. ఇది నైలాన్ లేదా సింథటిక్ పదార్థంతో తయారవుతుంది. దీనికి పదును పెంచడానికి గాజు పొడిని ఉపయోగిస్తారు. సాధారణ దారం గాలిపటం తెగినప్పుడు మధ్యలో తెగిపోతుంది.. కానీ చైనా మాంజా అంత సులభంగా తెగదు. ఆకాశంలో ఎగిరే పక్షుల రెక్కలు ఈ దారానికి తగిలి తెగిపోతాయి. ఏటా వేల సంఖ్యలో పక్షులు ఈ మాంజా వల్ల ప్రాణాలు కోల్పోతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులకు ఈ దారం మెడకు చుట్టుకుని గాయాలవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో గొంతు కోసుకుపోయి మరణించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ దారంలో లోహపు కణాలు ఉండటం వల్ల విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టే ప్రమాదం ఉంది. పర్యావరణ రీత్యా కూడా చైనా మాంజా చాలా హానికరం. సాధారణ నూలు దారం మట్టిలో కలిసిపోతుంది కానీ ఈ సింథటిక్ దారం వందల ఏళ్లయినా భూమిలో కరగదు. చెట్లపై, భవనాలపై చిక్కుకుపోయిన ఈ దారం పర్యావరణానికి పెద్ద ముప్పుగా మారుతోంది. జాతీయ హరిత ట్రిబ్యూనల్ (ఎన్ జీటీ) ఇప్పటికే దీనిపై నిషేధం విధించినప్పటికీ.. కొందరు వ్యాపారులు రహస్యంగా విక్రయిస్తున్నారు. అందుకే. ప్రజల భాగస్వామ్యం ఉంటేనే దీన్ని అరికట్టగలమని ఎమ్మెల్యే భావించారు.

### ఎమ్మెల్యే నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు

కేవలం చట్టాలు చేస్తే సరిపోదని.. ప్రజలను భాగస్వాములను చేస్తూ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఖైరతాబాద్ ప్రజలతో పాటు పర్యావరణ ప్రేమికులు ఎంతగానో ప్రశంసిస్తున్నారు. ఒక ప్రజాప్రతినిధి తన సొంత సొమ్మును బహుమతిగా ప్రకటించి మరీ ప్రజల ప్రాణాలను కాపాడాలని చూడటం గొప్ప విషయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వినూత్న ప్రయత్నం వల్ల వ్యాపారుల్లో భయం మొదలవుతుందని.. తద్వారా చైనా మాంజా విక్రయాలు తగ్గుముఖం పడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు సాధారణ దారాన్ని మాత్రమే కొనివ్వాలని పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## అరెస్టులతో మాజీ సర్పంచుల గొంతు మూయలేరు

**పెండింగు బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా??**

**రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



**అమనగల్లు, మహా:** తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు.పెండింగ్ బిల్లులు ఇవ్వాలని రెండు సంవత్సరాలుగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయా గ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన సుమారు 1000 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రోజు సర్పంచుల అసెంబ్లీ ముట్టడి మేరకు ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం దారుణమని అన్నారు.వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అందాల పోటీలకు, గ్లోబల్ సమ్మిట్లకు పైసలున్నాయి కానీ గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు నిధుల లేవా ?? అని ప్రశ్నించారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

# అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

**పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ**

**అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచుల యత్నం**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ మాజీ సర్పంచులు తమ పెండింగ్ బిల్లుల కోసం చేపట్టిన 'చలో అసెంబ్లీ' ముట్టడి ఉద్రిక్తతలకు దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడుస్తున్నా, గతంలో గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ క్రమంలో తమ బకాయిలను వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో అసెంబ్లీని ముట్టడించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు హైదరాబాద్‌కు తరలివచ్చారు. అసెంబ్లీకి వెళ్లే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. సర్పంచుల ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు వివిధ జిల్లాల్లో అర్ధరాత్రి నుంచే అరెస్టులు ప్రారంభించడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి ఆదర్శంగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు, నేడు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వంలో మాజీ సర్పంచులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగయ్యతో పాటు పలు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. అసెంబ్లీని ముట్టడించేందుకు ప్రయత్నించిన మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు పోలీసులు. రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లకు రూ. 531 కోట్ల బిల్లులను చెల్లించాల్సి ఉంది. అసెంబ్లీ ఎదుట తమ పెండింగ్ బకాయిల కోసం డిమాండ్ చేస్తున్న సమయంలో ఓ మాజీ సర్పంచ్ అస్వస్థతకు లోనయ్యారు. ఆయన నేలపై పడిపోగా, పోలీసులు ఆయనను అంబులెన్సులో అక్కడి నుంచి తరలించారు.



## అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై గళాన్ని వినిపించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, సోమవారం తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో నియోజకవర్గంలోని సమస్యలపై మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని తుర్కయంజాల్ మాసబ్ చెరువు పూర్తిగా కబ్జాకు గురి కావడంతో, పరిసర ప్రాంతంలోని పలు కాలనీలు సమస్యల వలయంలో చిక్కుకొని అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో మంత్రులు, హైడ్రా అధికారులను కలిసిన ఎమ్మెల్యే, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు....



## దయాకర్ రెడ్డిని కలిసిన ట్రస్మా నేతలు

**సమస్యల పరిష్కారానికి వినతి**

**ఖమ్మం :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డిని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా, పాలేరు డివిజన్ నూతన బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో దయాకర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఆయనకు పరిచయం చేశారు. అనంతరం పాఠశాలల నిర్వహణలో ఎదురవుతున్న పలు సాంకేతిక ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను దయాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వీటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. దీనిపై దయాకర్ రెడ్డి స్పందిస్తూ.. సమస్యలను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు జి. కాంతారావు, జిల్లా ట్రెజరర్ వై. నరసయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి. ఇర్షద్ అహ్మద్, జిల్లా జాయింట్ సెక్రెటరీ బి. నాగార్జున, జిల్లా ఈసీ మెంబర్ కే. నాగేశ్వరరావు పాల్గొన్నారు. పాలేరు డివిజన్ అధ్యక్షులు పొదిల శివకృష్ణ, సెక్రెటరీ బి. శ్రీనివాస్, ట్రెజరర్ కే. సీతారాములు తదితరులు ఉన్నారు.

## అటవీ చట్టాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ఎఫ్‌డీవో మంజుల**

**కారేపల్లి, మహా :** కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చీమలపాడు అటవీ ప్రాంతంలో అక్రమంగా బోరులు వేస్తున్న రెండు వాహనాలను ఫారెస్టు అధికారులు 28వ తేది తెల్లావారుజామున పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఖమ్మం ఫారెస్టు డివిజనల్ అధికారి వీ. మంజుల వివరాలు వెల్లడించారు. రాగబోయినగూడెం నార్త్ బీట్ కంపార్ట్‌మెంట్ నెం.14/2 లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా బోరు పాయింట్లు వేస్తున్నారు. విశ్వాసనీయ సమాచారం మేరకు ఎఫ్‌డీవో ఆధ్వర్యంలో ఖమ్మం స్పెషల్ టీమ్ కారేపల్లి రేంజ్ అటవీ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీలలో టీఎస్12 ఈకే 3699, ఏపీ04ఏపీ3294 బోరు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌డీవో తెలిపారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ భూముల పరిరక్షణలో భాగంగా, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా వంటి చర్యలపై కఠినమైన పరిరక్షణ విధానాలను పాటిస్తున్నామన్నారు. అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో వి.మంజుల హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలు గమనిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను ఎఫ్‌డీవో కోరారు.






# మేడారం మెరిసేలా

## పునర్నిర్మాణంతో పునరుజ్జీవం.. స్వర్ణకాంతులు.. కొత్త సొగబులు..

### ధగ ధగ మెరుస్తున్న మేడారం.. పులకించిపోతున్న భక్తజనం..

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ఆలయానికి వైభవం

### వందల ఏళ్లు చెక్కుచెదరకుండా అభివృద్ధి పనులు

### భావి తరాలకు తెలిసేలా శిలలపై తల్లుల చరిత్ర

(మహా ప్రత్యేకం)

ఎట్లున్న మేడారం ఎట్ల మారింది. మొత్తం రూపురేఖలే మారిపోయాయి. నాటి మేడారానికి నేటి మేడారానికి ఎంతో తేడా కనిపిస్తోంది. భక్తులు మెచ్చేలా.. మురిసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో జాతర నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులు భారీ స్థాయిలో చేపట్టారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతర మేడారం. రెండేళ్ళకోసారి జరిగే ఈ జాతరకు లక్షలాది మంది తరలివస్తారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతర ఈ సారి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. జాతర నిర్వహణకు అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా చేపట్టింది. ఇందుకు రూ. 251 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులో గద్దెల విస్తరణకే రూ. 101 కోట్లు వెచ్చిస్తున్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఈసారి మహా జాతరను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మేడారం ధగ ధగ మెరుస్తోంది. ఏర్పాట్లు, అభివృద్ధి పనులను చూసి భక్తులు మురిసిపోతున్నారు. కొత్త సొగబులు.. కొత్త కాంతులు వారిని కట్టిపడేస్తున్నాయి. గత పాలకులు ప్రతి సారి జాతర వచ్చిందంటే కోట్లాది రూపాయలు వెచ్చించి తాత్కాలికంగా అభివృద్ధి పనులు, వసతులు కల్పించేవారు. ప్రతీ సారి ఇదే జరుగుతుండేది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఒక ప్రణాళిక విజన్‌తో సీఎం రేవంత్ రెడ్డి మేడారం దశదిశను మార్చేస్తున్నారు. ఇందులో భాగంగా మేడారంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. దాదాపు ఈ పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయి. వందల ఏళ్లపాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల శాశ్వత పునర్నిర్మాణం పనులు చేపట్టింది. జనవరి ఐదో తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు రాత్రింభవళ్లు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. 2026 జనవరి 2831 తేదీల మధ్య సమ్మక్కసారలమ్మ జాతర పెద్ద ఎత్తున జరగనుంది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు పనులు తుది దశలో వేగంగా సాగుతున్నాయి. గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ ఫిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చరిత్రను చిత్రీకరించారు. మార్బుల్ శిలలతో గద్దెలూ జంపన్నవాగు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్‌మెంట్, 60 అడుగుల నుంచి నాలుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూ లైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జనవరి మొదటి వారం నుంచి భక్తులు పుణ్య స్నానాలు చేయడానికి వీలుగా జంపన్న వాగులో నీటి ప్రవాహం సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు జాతర సజావుగా సాగేందుకు మహా కుంభమేళాలో భాగస్వాములైన నిపుణుల బృందం మేడారానికి చేరుకుని.. జాతర జరిగే ప్రాంతం, అక్కడికి దారి తీసే మార్గాలు, జాతర రద్దీ ఉండే ఉప ఆలయాలను సందర్శించి.. అధికారులకు తగిన సూచనలు..సలహాలు చేసింది. ఈసారి జాతరకొచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్‌కు అధికారులు చర్యలు చేపట్టారు. ఈసారి జాతర జరిగే 4 రోజులూ డ్రోన్‌షో ప్రత్యేక ఆకర్షణ కానున్నది. డ్రోన్‌షో ఎక్కడ నిర్వహించాలో త్వరలో నిర్ణయం తీసుకుంటారు. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు. జాతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జనవరి 5 వరకు పనులన్నీ పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోంది.

#### అభివృద్ధి పనుల జాతర..

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం రూ. 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గద్దెల విస్తరణకే రూ. 101 కోట్లు కేటాయించింది. 4,000 టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టారు.750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన 7,000కి పైగా శిల్పాలు, 930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా శిల్ప రూపకల్పన చేశారు. 46 స్తంభాలతో 271 చ.మీ విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె నిర్మాణం చేపట్టారు. 40 అడుగుల వెడల్పుతో 3 స్వాగత తోరణాలు, 30 అడుగుల వెడల్పుతో 5 స్వాగత తోరణాలు, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బండారి, మర్రి, వెదురు, వేప, ఇప్ప తదితర 12 రకాల పవిత్ర వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. 140 రకాల ఆయుర్వేద మొక్కల నాటనున్నారు. పూజారుల సంఘం ఆమోదంతోనే అన్ని పనులు జరుగుతున్నాయి. 2026 జనవరి 28వ తేదీ బుధవారం సారలమ్మ రాకతో మేడారం మహా జాతర ప్రారంభమవుతుంది. 29న గురువారం సమ్మక్క దేవత గద్దెకు రావడం, 30న శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, 31వ తేదీ దేవతల వనప్రవేశంతో జాతర ముగియనుంది. మొత్తంగా చూస్తే గతంలో చూసిన మేడారానికి... ప్రస్తుతం చూడబోయే మేడారానికి చాలా తేడాలుండనున్నాయి. గద్దెల విస్తరణలో అత్యంత అద్భుతంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. జాతరలోపే నిర్మాణ పనులన్నీ పూర్తి కావాలని సర్కారు స్పష్టం చేసింది. ఆ దిశగానే కాంట్రాక్టర్లు కూడా పనులు నిర్వహిస్తున్నారు.

#### గిరిజన పూజారుల సూచనలను పరిగణనలోకి

పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులు, పెద్దలతో ముఖ్యమంత్రి, మంత్రులు చర్చించారు. వారి సూచనలు, సలహాలను తీసుకున్నారు. వాటిని పరిగణనలోకి తీసుకొని మేడారంలో అభివృద్ధి పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మేడారం జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోనున్నాయి. నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం నిర్మిస్తున్నారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నారు. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేశారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా చెక్కించారు. ఇందుకోసం తెలుపు రంగు రాళ్లను ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు తరలించి శిల్పులతో చెక్కించాక మేడారానికి తీసుకొచ్చారు.

#### భావి తరాలకు తెలిసేలా శిలలపై తల్లుల చరిత్ర

మేడారంలో కోయల ఆచార సంప్రదాయాలకు తగ్గట్టుగా సర్కారు పనులు చేపడుతూ.. సమ్మక్క సారక్క తల్లుల చరిత్ర అందరికీ తెలిసేలా శిలలపై చెక్కించారు. కోయల వద్ద దొరికిన 930 ఏండ్ల నాటి తాళపత్ర గ్రంథాల ఆధారంగా చెక్కించిన శిల్పాలు, చిహ్నాలు. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారక్క పగిడిద్దరాజు, గోవిందరాజు, కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి, పశుపక్ష్యాదులతో పాటు కోయల జీవనశైలికి, ఆచార సంప్రదాయాలకు, గొట్టు గోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ, నిలువు గీతలకు స్తంభాలపై చోటు దక్కింది. అలాగే సమ్మక్క సారక్క వంశస్తులైన దాదాపు 250 కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కడం ద్వారా వాళ్ల చరిత్రను భావితరాలు తెలుసుకునే అవకాశం దక్కుతుంది. అందు కోసమే ప్రత్యేకంగా కోయల ఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కించేందుకు ప్రాధాన్యమిచ్చారు. గద్దెల ముందు తెల్లని గ్రానైట్ స్తంభాలతో ఏర్పాటు చేస్తున్న ప్రధాన ద్వారం, ఆయా శిలలపై సమ్మక్క సారక్క పూర్వీకులతో పాటు, కోయల జీవనశైలిని తెలిపేలా చెక్కిన ఏడు వేల బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. 50 ఫీట్ల వెడల్పుతో ఉన్న ఈ ప్రధాన ద్వారానికి 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో రెండువైపులా రెండేసి నిలువు స్తంభాలు, వాటిపై 80 ఫీట్ల పొడవైన అడ్డు స్తంభం, దానిమీద 60 ఫీట్ల పొడువైన మరో అడ్డు స్తంభం ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు గద్దెల చుట్టూ 25 ఫీట్ల ఎత్తు, 5 ఫీట్ల వెడల్పుతో 8 స్తంభాలు నిలుపుతున్నారు. వీటిపై సమ్మక్క సారక్కతో పాటు 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలుగా చెక్కారు. గద్దెల చుట్టూ బయటి వైపు శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్లకు సంబంధించిన జీవన చిత్రాలను గీశారు. వీటిని చెక్కేందుకు ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నెలల తరబడి రేయింబవళ్లు శ్రమించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి తెప్పించిన భారీ గ్రానైట్ రాళ్లను ఇందుకు వినియోగించారు. అనంతరం వాటిని భారీ ట్రక్కుల్లో 600 కిలోమీటర్ల దూరంలోని మేడారానికి తరలించారు. ఇంతటీ మహాద్భుతంగా మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టడం రికార్డే..



#### సీఎం రేవంత్ రెడ్డి పట్టుదల

గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన సమయంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఆ సమయంలో ప్రజలు, ఆదివాసీలు మేడారంలో అభివృద్ధి పనులు , పునర్నిర్మాణ పనులు చేపట్టాలనీ, జాతరకు అన్ని హంగులు కల్పించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే తప్పకుండా మేడారంలో పునర్నిర్మాణ పనులు చేసి తీరుతామని నాడు రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నేడు మేడారం అభివృద్ధికి నడుం బిగించారు. ఇచ్చిన మాటను నేడు నిలుపుకుంటున్నారు. మేడారంలో వసతుల కల్పన.. పునర్నిర్మాణ పనులు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి రూ. 251 కోట్లు మంజూరు చేశారు. ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో నిత్యం మేడారంలో జరిగే పనులపై సమీక్ష నిర్వహిస్తూ మంత్రులు, అధికారులకు సూచనలు చేస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు. డిసెంబర్ చివరిలోగా పనులు పూర్తి చేసేలా అధికార యంత్రాంగాన్ని పురమాయిస్తున్నారు. మేడారం జాతరను దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా కనులపండువగా నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు.

#### నిత్యం మంత్రుల బృందం సమీక్ష..

మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ నిత్యం పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. అధికారుల పురమాయిస్తూ పనులు వేగవంతానికి ఎప్పటికప్పుడు



చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. మంత్రుల బృందం ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తుండడం వల్ల పనులు వేగవంతంగా సాగుతున్నాయి.



# అరెస్టులతో మాజీ సర్పంచుల గొంతు మూయలేరు

## పెండింగు బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా??

## రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**అమనగల్లు, మహా:** తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీత మని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు.పెండింగ్ బిల్లులు ఇవ్వాలని రెండు సంవత్సరాలుగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన సుమారు 1000 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రోజు సర్పంచుల అసెంబ్లీ ముట్టడి మేరకు ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం దారుణమని అన్నారు.వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అందాల పోటీలకు, గ్లోబల్ సమ్మిట్లకు పైసలున్నాయి కానీ గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు నిధుల లేవా ?? అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

# హెచ్ఐవిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

- హెచ్ఐవిపై అవగాహన కల్పించిన "దిశ" టీం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని లలితాదేవి
- పాఠశాలల విద్యార్థులచే హెచ్ఐవి పై భారీ ర్యాలీ
- ఆటోనగర్లో హెచ్ఐవి పరీక్షలో పాల్గొన్న లారీ డ్రైవర్లు
- లారీ డ్రైవర్లను అభినందించిన వైద్య ఆరోగ్య అధికారులు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** హెచ్ఐవిపై ప్రజలకు అవగాహన ఉండాలని, అపోహలు వీడాలని డిఎంహెచ్ఓ లలితాదేవి తెలిపారు. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పరిధిలోని ఆటోనగర్ ఏరియాలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని లలితాదేవి సూచన మేరకు, డిప్యూటీ డిఎంహెచ్ఓ పాపారావు ఆదేశాలతో, డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి ఎయిడ్స్ (దిశ) రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో, ఆటోనగర్ పరిసర ప్రాంతంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై పాఠశాలల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యులు నిర్వహించిన హెచ్ఐవి అవగాహన క్యాంపులో, ప్రజలకు దిశ సిబ్బంది హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహన కల్పిస్తూ, 72 మంది లారీ డ్రైవర్లకు, ఉచితంగా ఎయిడ్స్ హెచ్ఐవి రక్త పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్ఐవి ఎయిడ్స్ పరీక్షలు చేయించుకున్న లారీ డ్రైవర్లను, దిశా సిబ్బందిని జిల్లా వైద్యాధికారులు అభినందించారు.

**రోగాన్ని నిలువరించవచ్చు...**

ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ హెచ్ఐవి స్థితిని తెలుసుకుని ఆరోగ్యంగా ఉండడంతో పాటు కుటుంబ రక్షణగా ఉండాలని అన్నారు. హెచ్ఐవి సోకిన రోగులకు సర్కార్ దవాఖానాలో మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్యుల సూచన మేరకు, వాటిని దావఖానాలో ఉచితంగా పొందవచ్చని తెలియజేశారు. ప్రజలు హెచ్ఐవి టెస్టు చేయించుకోవడం వల్ల లాభమే జరుగుతుందని, అపోహలకు అనుమానాలకు తావివ్వొద్దని వైద్యులు సూచించారు. రోగం సోకినట్లయితే సరైన సమయంలో సరైన మందులు వాడడం వల్ల రోగాన్ని నిలువరించవచ్చని ఉన్నత వైద్యాధికారులు తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలో మరిన్ని హెచ్ఐవి టెస్ట్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని హెచ్ఐవి దార ద్వారా తమ స్థితిని తెలుసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిశ సిబ్బంది డానియెల్, రమేష్, మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ గీతాలు, విఎస్ఎస్ఏ టిఐ ఎన్జీఓ సిబ్బంది పాల్గొన్నారు.




# శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి..

## జోనల్ కమిషనర్ చంద్రకళ

**రాజేంద్రనగర్, మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించింది. శంషాబాద్ జోన్ పరిధిలోని డివిజన్లు 118 శంషాబాద్, 119 కొత్వాల్గూడ, తొండుపల్లి ఫ్లైఓవర్ పైనా జిహెచ్ఎంసి కార్మికులు శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ సోమవారం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత జిహెచ్ఎంసి తీసుకుంటుందన్నారు. శంషాబాద్ జిహెచ్ఎంసి లో విలీనం కావడంతో మౌలిక వసతులపై ముఖ్యంగా సానిటేషన్, రోడ్లు, డ్రైనేజీలు, శుభ్రంగా ఉంచే బాధ్యత జిహెచ్ఎంసి అధికారులదే అన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనులను శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, డిఇఇ అన్నపూర్ణ తో కలిసి శానిటేషన్ పనులను సమీక్షించారు.

# నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

## ఎక్సైజ్ సిఐ బద్యనాథ్ చౌహాన్




**అమనగల్లు, మహా :** నూతన సంవత్సర వేడుకలను (ఈవెంట్స్) జరుపుకునే వారు ముందుగానే ఎక్సైజ్ అధికారుల నుండి అనుమతులు పొందాలని అమనగల్లు ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ బద్యనాథ్ చౌహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అనుమతి పొందకుండా వేడుకలు జరుపుకునే పార్టీలలో లిక్కర్ వాడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జరుపుకోవాలని,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందికరంగా తదితర పనులు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి పార్టీలు, మద్యం సేవించి రోడ్లపై విచ్చలవిడిగా తిరగడం, దురుసుప్రవర్తనలు చేపట్టిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం షాపులు అనుమతించిన సమయంలోనే తెరవాలని, లేకుంటే సహించేదిన్నారు.ఫాస్ట్ ఫుడ్ సెంటర్, దాబలలో మద్యంసిట్టింగ్ పర్మిషన్ లకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే సిజ్ చేయడం జరుగుతుందన్నారు సర్కిల్ పరిధిలోని ఫంక్షన్ హాల్లు, ఫామ్ హౌస్లలో లిక్కర్ పార్టీలు చేసుకునేవారు ఈవెంట్ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని అనుమతి కోసం ఆన్లైన్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సారా తయారీ, సారా, బెల్లం, పటీక అమ్మిన, నిల్వ ఉంచిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.



నూతన ఎస్సైచ్వో సత్యనారాయణ గౌడ్ కు

# శుభాకాంక్షల వెల్లువ

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్హెచ్వో గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ గౌడ్ ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జగన్, సురేష్, దుర్గాప్రసాద్, కిషోర్, కృష్ణ, శ్రీనివాస్, జగ్గు తదితరులు.

జాతీయస్థాయిలో రాణించిన

# వాసవి కళాశాల విద్యార్థులు

- డ్రిప్ బాల్ ఛాంపియన్షిప్ లో తెలంగాణ విద్యార్థులు
- జాతీయస్థాయిలో మరిన్ని పథకాలు సాధించాలి
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు
- వాసవి విద్యాసంస్థల చైర్మన్ మాదారం రమేష్ గౌడ్




క్రీడలలో రాణించిన పూర్వ విద్యార్థులు....

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జాతీయస్థాయిలో క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వాసవి కళాశాలల విద్యార్థులు. గత మూడు రోజుల నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధురలో జరుగుతున్నటువంటి జాతీయస్థాయి డ్రిప్ బాల్ ఛాంపియన్షిప్ లో తెలంగాణ విద్యార్థులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వాసవి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆర్ కిరణ్, జె రమేష్, కుర్ర రామ్ చరణ్, ఈ శ్రీరామ్, ఎస్ రవితేజ, కళాశాల పిటి రెహమాన్, తెలంగాణ రాష్ట్ర తరపున డ్రిప్ బాల్ క్రీడలలో పాల్గొనడం జరిగింది. బాలుర సెమీఫైనల్ లో తెలంగాణ జట్టు, మహారాష్ట్ర జట్టుతో హోరా హోరీగా పోరాడి ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో కాంస్య పథకాన్ని తెలంగాణ జట్టు క్రీడాకారులు సాధించడం జరిగింది. డ్రిప్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ అరవింద్ చితోడియా, తెలంగాణ రాష్ట్ర జట్టు క్రీడాకారులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. మాకు మా కళాశాలకు ఎంతో గర్వకారణం కళాశాల విద్యార్థులకు వారి అధ్యాపక బృందానికి, కళాశాల యాజమాన్యం తరపున వాసవి కళాశాలల చైర్మన్ రమేష్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వాసవి విద్యాసంస్థల చైర్మన్ మాదారం రమేష్ గౌడ్ మాట్లాడుతూ... మా కళాశాల విద్యార్థులు డ్రిప్ బాల్ ఛాంపియన్షిప్ గెలుపొందడం మా కళాశాలకు ఎంతో గర్వకారణం అని అన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు, వారిని ప్రోత్సహిస్తున్న అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు హృదయపూర్వకమైన ధన్యవాదాలు కళాశాల యాజమాన్యం తరపున తెలియడం జరుగుతుందని అన్నారు. గతంలో వాసవి కళాశాలలో విద్యను అభ్యసించినటువంటి ఎంతోమంది విద్యార్థులు క్రీడారంగంలో రాణించారు. మా విద్యార్థి తుకారాం నాయక్ ఎవరెస్టు శిఖరాన్ని కూడా గతంలో అధిరోహించడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ అందించిన విద్యార్థులు. క్రికెట్, కోకో క్రీడలలో నైపుణ్యంతో కూడిన ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎన్నో పథకాలు సాధించడం జరిగిందన్నారు.

**జాతీయస్థాయిలో మరిన్ని పథకాలు సాధించాలి.....**

చదువుతో పాటు మా కళాశాలలో సంస్కారాన్ని క్రీడలను అందిస్తున్నాం. రాబోవు కాలంలో కూడా జాతీయస్థాయిలో మనీ మరిన్ని పథకాలు సాధించేలా, క్రీడలలో ఉత్తమ ఫలితాలు పొందేలా విద్యార్థులను తయారు చేస్తామని కళాశాల చైర్మన్ రమేష్ తెలిపారు. మరోసారి విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డ్రిప్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండి రెహమాన్, కార్యదర్శి వినోద్, మహారాష్ట్ర ట్రిపుల్ అసోసియేషన్ కార్యదర్శి స్వామి శోభన్, ప్రెసిడెంట్ మనుసింగ్, ఉత్తర్ ప్రదేశ్ సెక్రటరీ వన్ పాల్, తమిళనాడు అసోసియేషన్ కార్తికేయన్ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.




# ఏబీవీపీ రాష్ట్ర మహాసభల గోడ ప్రతిక ఆవిష్కరణ

**ఆమనగల్లు, మహా:** అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 44 వ రాష్ట్ర మహాసభలను 3 నుంచి 5వ తేదీ వరకు శంషాబాద్ లో నిర్వహిస్తున్నట్లు గేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు పురుగుల శివ తెలిపారు. మహా సభలకు సంబంధించి వాల్ పోస్టర్ ను ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి సోమవారం విడుదల చేశారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ నిరుద్యోగుల నిరాశే మిగిల్చిందన్నారు..... 3,5 తేదిలో జరిగే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమాల్లో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు లండం మల్లేష్ చెన్నంశెట్టి మల్లేష్, ఎడవల్లి అంజి నేనవత్ సుమన్ నేనవత్ తరుణ్ సన్ని మరియు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో యూరియా కొరత లేదు

## జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా నిల్వను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతామని తెలిపారు.



# వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మూడేళ్ల చిన్నారి

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ అత్తాపూర్ పరిధిలోని వాసుదేవ రెడ్డి కాలనీలో 3 సంవత్సరాల నిత్యశ్రీ అనే పాప ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా వీధి కుక్కలు మొహంపై దాడి చేశాయి. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో మొఖంపై తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పాప ముఖంపై 18 కుట్లు పడ్డాయి ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఉందని డాక్టర్లు తెలిపారు. పాపకు ఎలాంటి ప్రాణహానిలేదని తెలుపడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాసుదేవ రెడ్డి నగర్ కాలనీవాసులు జిహెచ్ఎంసి లో పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోకపోతే జిహెచ్ఎంసి కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహిస్తామన్నారు. వెంటనే అధికారులు తమ సిబ్బందికి పరమాయించి వీధి కుక్కలను పట్టికెళ్లారు.




# ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**ఆమనగల్లు, మహా:** ధ్యానం చేయడంతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు, ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలని అన్నారు, సోమవారం మండల పరిధిలోని హనుమాస్పల్లి మహేశ్వర మహా పిరమిడ్ లో నిర్వహిస్తున్న ధ్యాన మహాయాగం 4 9వ రోజుకు చేరాయి ధ్యానమయాగంలో ఉదయం ఐదు గంటల నుంచి 8 గంటల వరకు సరస్వతి ప్రాంగ ణంలో సభావేదిక వద్ద ప్రాతకాలం ద్యానం నిర్వహించారు. ప్రపంచ ద్యాన గురువు దివంగత సుభాష్ పత్రీజ్ ధ్యాన, ఆధ్యాత్మిక సందేశాల వీడియోలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పిరమిడ్లో లోని కింగ్ చాంబర్లో సందర్శకులు ధ్యానంలో లీనులయ్యారు. పిరమిడ్ లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ధ్యాసులు, ఆధ్యాత్మికవేత్తలు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దసరత్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహ రెడ్డి, సర్పంచ్ సేవ్య నాయక్, ఉపసర్పంచ్ లక్పతి నాయక్, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు మాధవి, దామోదర్ రెడ్డి, భాస్కరానంద, హన్మంతరావు, సాంబశివరావు, మారం శివప్రసాద్, లక్ష్మి, జ్యోతి, పాండు నాయక్, తదిత రులు పాల్గొన్నారు.

# జిల్లాలో తగ్గిన నేరాలు-ఎస్పీ

## ప్రెస్ మీట్ లో వార్షిక నివేదిక వెల్లడి




**ఆదిలాబాద్ మహా:** గత సంవత్సరం కంటే హత్యలు, రోడ్డు ప్రమాదాల మరణాలు, మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.సోమవారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని సమావేశ మందిరంలో వార్షిక నివేదికపై ప్రెస్ మీట్ లో ఆయన వివరాలు వెల్లడించారు. నూతన విధానాలతో ప్రజలకు జిల్లా పోలీసు వ్యవస్థ మరింత చేరువైందన్నారు.ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుండి పోలీస్ సేవల పట్ల ప్రజలలో విశేష స్పందనతో పాటు పోలీసుల పట్ల నమ్మకం విశ్వాసం పెరిగేలా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దినట్టు తెలిపారు. ముఖ్యంగా మహిళలు చిన్నారుల రక్షణకై షీ టీం ను పటిష్టం చేయడం, ఆపరేషన్ జ్వాలా, పోలీస్ అక్క ద్వారా మహిళలకు విద్యార్థినిలకు చేరువయ్యామన్నారు. ఆదిలాబాద్ ను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పాఠశాల కళాశాల విద్యార్థిని విద్యార్థులచే యాంటి డ్రగ్ కమిటీ లను ఏర్పాటు చేయడం, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో పర్యటించి ప్రజలకు మరింత చేరువయ్యామన్నారు. ఆదివాసి ప్రజలకు యువతకు చదువు పట్ల అవగాహన కల్పించినట్టు తెలిపారు., గిరిపల్లెల్లో ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణ, చలికాలంలో దుప్పట్లను అందించడం, యువతకు వాలీబాల్ కిట్లను అందించినట్టు తెలిపారు. నూతన సిబ్బందికి వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసి సిబ్బంది కి విధుల పట్ల పూర్తి అవగాహన కల్పించేలా చేస్తున్నామన్నారు.త్వరితగతిన కేసుల దర్యాప్తు పూర్తి చేసేలా నిష్ణాతులచే శిక్షణను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన విభాగం ఏఎస్పీ పి మౌనిక, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ బి గుణవంతురావ్, ఎస్ఐ హాకీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన దేవాలయాలు

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని పాత పోలీస్ స్టేషన్ వెనకల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు దేవాలయాన్ని పూల తోరణాలతో వెలుగు కాంతులతో అందంగా తీర్చిదిద్దారు. శంషాబాద్ జోన్ పరిధిలో వెంకటేశ్వర స్వామి దేవాలయాలు వైకుంఠ ఏకాదశి సందర్భంగా అందంగా ముస్తాబ్ అయ్యాయి.

# ఫ్యాబ్ సిటీ బాధిత రైతులను ఆదుకోవాలి...




- సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- జిల్లా కలెక్టరుకు మెమోరాండం
- రైతులకు కేటాయించిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఫ్యాబ్ సిటీలో భూములు కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పగడాల యాదయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలంలోని, రావిర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములను ఫ్యాబ్ సిటీకి కేటాయించడంతో, భూములు కోల్పోయిన బాధిత రైతులను ఆదుకోవాలని, సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతపత్రం అందచేశారు. 2022లో నష్ట పరిహారం కింద గ్రామ రైతులకు హెచ్ఎండిఏ ద్వారా ఇంటి స్థలాలు కేటాయించినా...! నేటి వరకు రిజిస్ట్రేషన్ చేయకపోవడం విడ్డూరమని యాదయ్య అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఉన్నత అధికారులు చొరవ చూపి త్వరగా రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, జిల్లా కలెక్టరుకు విన్నాపించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా మండల నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

# రాజేంద్రనగర్ జోన్, సర్కిల్ కార్యాలయాన్ని మార్చొద్దు

## అంబేద్కర్ సంఘం సర్కిల్ అధ్యక్షులు జీవన్ దాస్




**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కారిక్రమములో సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయము ఇక్కడే ఉండాలి. వేరే ప్రాంతానికి ఎట్టి పరిస్థితి లో తరలించొద్దుఅని. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి కి అంబేద్కర్ సంఘం సర్కిల్ అధ్యక్షులు జీవన్ దాస్, సూర్యం, రాజ్ కుమార్ లు సోమవారం వినతి పత్రం అందజేశారు.

# ఎన్నికల విధులలో అధికారులు..

## కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో ఫ్రీ కాస్ట్ వేసిన కబ్జా రాయుళ్లు... రెండోసారి కూల్చివేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు...



**రాజేంద్రనగర్, మహా ;** కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములలో కబ్జా రాయుళ్లు.. శంషాబాద్ మండలం చౌదర్ గూడా రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 160 లో గల కోట్లు విలువచేసే మూడెకరాల పైచిలుకు ప్రభుత్వ భూమిలో గతంలో ప్రికాస్ట్ వేశారు. గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు గత నెలలో కూల్చివేతలు చేపట్టారు. సర్పంచ్ ఎన్నికల కోడ్ను అదునుగా చూసుకున్న కబ్జారాయిలు ఎన్నికల హడావిడిలో అధికారులు పంచాయతీ సమరంలో గ్రామస్తులు బిజీగా ఉండడంతో ఇదే సరైన సమయమని భావించి మూడు ఎకరాలు పై చిలుకు ప్రభుత్వ భూమిలో ఫ్రీ కాస్ట్ వేశారు. దానికి గేటు కూడా పెట్టారు. మరోసారి ఫిర్యాదు రావడంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో ఫ్రీ కాస్ట్ వేయడానికి చూసి అవాక్కయ్యారు. గతంలో కూల్చివేసిన మరోసారి వేశారని ముక్కు మీద వేలు వేసుకొని కూల్చివేతలు చేపట్టారు.

**ఎమ్మార్వో హెచ్చరిక...**

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మార్వో రవీందర్ దత్ తెలిపారు.

**గ్రామస్తుల డిమాండ్...**

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జారాయిలు వాలిపోతారు. గతంలో ప్రికాస్ట్ నిర్మిస్తున్న సమయంలో రెవెన్యూ అధికారుల సమాచారంతో కూల్చివేతలు జరిగాయి. కూల్చివేతలు జరిగిన సర్పంచ్ ఎన్నికలు అదునుగా చూసుకున్న కబ్జా రాయుళ్లు బరితెగించి ప్రభుత్వ భూమిలో మరోసారి ఫ్రీ కాస్ట్ వేశారు. ఇలాంటి వ్యక్తులపై ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# ఇషా అంబానీ సారథ్యం..

## రిలయన్స్ రిటైల్ సరికొత్త రికార్డ్!



ఇషా అంబానీ నాయకత్వంలో.. రిలయన్స్ రిటైల్ 2025లో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఏడాది ముగిసే సమయానికి దేశంలో రిలయన్స్ రిటైల్ స్టోర్ల సంఖ్య 7000 కంటే ఎక్కువ నగరాల్లో.. 20వేలకు చేరుకుంది. ఇందులో ఒక బిలియన్ కంటే ఎక్కువ కస్టమర్ లావాదేవీలను నెరవేర్చడమే కాకుండా.. లక్షలాది మంది భారతీయులకు ప్రాథమిక షాపింగ్ గమ్యస్థానంగా దాని స్థానాన్ని బలోపేతం చేసింది. రిలయన్స్ 48వ వార్షిక సర్వసభ్య సమావేశంలో.. ఫిజికల్ స్టోర్లే మొత్తం వ్యవస్థకు వెన్నెముక అని ఇషా అంబానీ పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ ఏడాది వస్తువులను ఆర్డర్ చేసిన 30 నిమిషాల్లో డెలివరీ చేసేలా లాజిస్టిక్స్‌ను మార్చారు. 600 కొత్త డార్క్ స్టోర్లు ఏర్పాటు చేశారు. జియోమార్ట్ 1,000కి పైగా నగరాల్లో విస్తరించింది. Ajio Rush ద్వారా ఫ్యాషన్ ఉత్పత్తులు కూడా డెలివరీ చేయడం ప్రారంభమైంది. ఇవన్నీ కంపెనీ అమ్మకాలను గణనీయంగా పెంచడంలో దోహదపడ్డాయి. గ్లోబల్ బ్రాండ్ ఉత్పత్తులను.. భారతీయులకు చేరువ చేయడంలో ఇషా అంబానీ కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'షీన్' బ్రాండ్‌ను ఇండియాకు తీసుకురావడం ద్వారా లక్షలాది మంది యువతను ఆకట్టుకున్నారు. ఫ్రెంచ్ బ్రాండ్ Maje, యువత కోసం Yousta, Azorte వంటివాటిని పరిచయం చేశారు. వీటికి పట్టణాల్లో మంచి ఆదరణ లభించింది. ప్రజలను ఆకట్టుకునే ఉత్పత్తులను ప్రవేశపెట్టడంతో.. రిలయన్స్ రిటైల్ ఆర్థికంగా 28 శాతం వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ FMCG విభాగం, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (RCPL), దాని రెండవ సంవత్సరంలోనే రూ.11,500 కోట్ల మైలురాయి టర్నోవర్‌ను సాధించింది. రాబోయే రోజుల్లో కంపెనీ ఏటా 20 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది.

# రూ. 21 వేలు తగ్గిన సిల్వర్ ధర!: కొత్త రేటు ఇదే..

భారతదేశంలో భారీగా పెరుగుతున్న వెండి ధరలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. MCX సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సోమవారం 8 శాతం లేదా కిలోకు రూ. 21,000 తగ్గింది. నాన్‌స్టాప్ ర్యాలీ తర్వాత కేజీ సిల్వర్ రేటు రూ. 254,174 నుంచి రూ. 233,120కు చేరింది. సోమవారం ఉదయం రూ. 2.50 లక్షల కంటే ఎక్కువ ధర వద్ద ఉన్న వెండి రేటు.. కొన్ని గంటల్లోనే భారీ పతనాన్ని చవిచూసింది. రాజకీయ, భౌగోళిక కారణాల వల్ల వరుసగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గ్లోబల్ మార్కెట్లో 50 డాలర్ల దిగువన ట్రేడవుతూ.. ఔన్సుకు 80 డాలర్ల మార్కును దాటేసింది. గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది.

**వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలు**

రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా.. డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. అంతే కాకుండా శాంతి ఒప్పందానికి అటు పుతిన్ కూడా సుముఖత చూపిస్తున్నారని ట్రంప్ పేర్కొనడంతో, యుద్ధం ముగిసే అవకాశం ఉంది. ఇది వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం అని తెలుస్తోంది. సుమారు రూ. 90వేలు వద్ద ఉన్న కేజీ వెండి ధరలు.. ఏడాది పూర్తి కాకముందే 181 శాతం పెరిగింది. ధర అమాంతం పెరుగుతున్న సమయంలో కొందరు వెండిని కొనడానికి ఆలోచించారు. ఇది కూడా సిల్వర్ రేటు తగ్గడానికి ఒక కారణం.

**వెండి ధరలు ఇంకా తగ్గుతాయా?**

వెండికి ప్రస్తుతం కేవలం ఆభరణాల కోసం మాత్రమే కాకుండా.. పారిశ్రామిక రంగంలో కూడా విరివిగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో సిల్వర్ రేటు తప్పకుండా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.



# రూ.3170 తగ్గిన గోల్డ్ రేటు!


## గంటల్లో మారిపోయిన ధరలు



భారతదేశంలో భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలకు బ్రేక్ పడింది. డిసెంబర్ 29న గోల్డ్ రేటు గరిష్టంగా రూ. 3170 తగ్గి.. పసిడి ప్రియుల మదిలో ఆశలు చిగురించేలా చేసింది. దీంతో గోల్డ్ రేటు తగ్గుముఖం పట్టింది. ఈ కథనంలో తాజా పసిడి ధరలు ఎలా ఉన్నాయనే వివరాలు తెలుసుకుందాం. సోమవారం ఉదయం హైదరాబాద్, విజయవాడలలో 650 రూపాయలు తగ్గిన 10 గ్రాముల 22 క్యారెట్స్ గోల్డ్ రేటు.. సాయంత్రానికి రూ. 2900 తగ్గింది. అంటే గంటల వ్యవధిలోనే 650 రూపాయలు కాకుండా.. అదనంగా మరో 2,250 రూపాయలు (మొత్తం 2,900 రూపాయలు తగ్గింది) తగ్గింది. 24 క్యారెట్ల గోల్డ్ రేటు కూడా మరింత తగ్గింది. దీంతో తులం ధర రూ. 1,39,250 వద్దకు చేరింది. అంతకు ముందు రోజు రేటు రూ. 1,42,420 వద్ద ఉండేది. దీనిబట్టి చూస్తే ఈ రోజు రూ. 3,170 తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఇదే ధరలు బెంగళూరు, ముంబై నగరాల్లో కూడా కొనసాగుతాయి. ఢిల్లీలో కూడా బంగారం ధరలు భారీగా తగ్గడంతో.. 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు 3170 రూపాయలు తగ్గి.. రూ. 1,39,400 వద్దకు చేరింది. 22 క్యారెట్స్ 10 గ్రాముల బంగారం ధర రూ. 2950 తగ్గి, రూ. 1,27,800 వద్ద నిలిచింది. వెండి ధరల విషయానికి వస్తే.. వెండి ధరలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. MCX సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సోమవారం 8 శాతం లేదా కిలోకు రూ. 21,000 తగ్గింది. నాన్‌స్టాప్ ర్యాలీ తర్వాత కేజీ సిల్వర్ రేటు రూ. 254,174 నుంచి రూ. 233,120కు చేరింది. సోమవారం ఉదయం రూ. 2.50 లక్షల కంటే ఎక్కువ ధర వద్ద ఉన్న వెండి రేటు.. కొన్ని గంటల్లోనే భారీ పతనాన్ని చవిచూసింది.

# మీరు బిజినెస్‌లో కింగ్ అవ్వాలంటే..

వ్యాపారం అంటే కేవలం పెట్టుబడి, అమ్మకాలు మాత్రమే అనుకుంటే పొరపాటే! ప్రస్తుత కాలంలో మారుతున్న అంతర్జాతీయ ఆర్థిక సమీకరణాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో బిజినెస్ రూపురేఖలే మారిపోయాయి. చాలా మంది పాత పద్ధతులతో నష్టపోతుంటే, కొందరు మాత్రం టెక్నాలజీని వాడుకుంటూ కోట్ల రూపాయల లాభాలు గడిస్తున్నారు. ఇంతకీ ఆ సక్సెస్ మంత్ర ఏమిటో తెలుసుకోవాలని అందరికీ కుతూహలంగా ఉంటుంది. వ్యాపారం చేసే ప్రతి వ్యక్తి కచ్చితంగా తెలుసుకోవాల్సిన ఐదు వ్యూహాలను కింద తెలియజేశాం.



### ఆర్థిక నిర్వహణ

వ్యాపారానికి క్యాష్ ఫ్లో, ఆర్థిక నిర్వహణ చాలా కీలకం. 2025లో గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్ 3% వద్ద స్థిరపడినప్పటికీ అంతర్జాతీయ టారిఫ్‌లు, సప్లై చైన్ సమస్యల వల్ల ముడిసరుకుల ధరలలో అనిశ్చితి కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం సేల్స్ పెంచుకోవడం మీద కాకుండా, ప్రాఫిట్ మార్జిన్లపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా 'ప్రాఫిట్ ఫస్ట్' పద్ధతిని అనుసరించడం ద్వారా ఆదాయం రాగానే లాభం, పన్నులు, వేతనాలను పక్కన పెట్టి, మిగిలిన మొత్తంతోనే ఖర్చులను నిర్వహించాలి. మార్కెట్‌లోని కొన్ని సాఫ్ట్‌వేర్‌లు ఇప్పుడు ఏఐ ఆధారిత అనలిటిక్స్‌ను అందిస్తున్నాయి. ఇవి భవిష్యత్తులో రాబోయే ఖర్చులను ముందే అంచనా వేసి, ఖర్చులను 2030% తగ్గించడంలో సహాయపడుతున్నాయి.

### కస్టమర్ ఫోకస్

కస్టమర్ అక్విజిషన్ కాస్ట్ (కొత్త కస్టమర్‌ను ఆకర్షించే ఖర్చు) భారీగా పెరిగింది. అందుకే ఉన్న కస్టమర్లను నిలబెట్టుకోవడమే అత్యంత లాభదాయకమైన మార్గం. 80 శాతానికిపైగా చిన్న వ్యాపారాలు ఇప్పుడు జనరేటివ్ ఏఐను వాడుతూ కస్టమర్లకు ప్రత్యేక అనుభవాన్ని అందిస్తున్నాయి. వ్యాపారులు కస్టమర్ డేటాను విశ్లేషించి, వారి అవసరాలకు తగినట్లుగా లాయల్టీ ప్రోగ్రామ్‌లు రూపొందించడం వల్ల రిపీట్ సేల్స్ పెరుగుతాయి. తాజా సర్వేల ప్రకారం, కస్టమర్ రిటెన్షన్ రేటు (అధిక మార్జిన్లు వచ్చే వస్తువులను కొనేలా చేయడం) 5% పెరిగితే, ప్రాఫిట్ మార్జిన్లు 25% నుంచి 29% వరకు మెరుగుపడే అవకాశం ఉంది.

### ఖర్చుల నియంత్రణ

ఖర్చు తగ్గించడం అంటే నాణ్యతను తగ్గించడం కాదు, వనరులను సమర్థవంతంగా వాడటం అని గుర్తుంచుకోవాలి. ఇంధన ధరలు, కార్మిక వ్యయాలు పెరిగిన తరుణంలో ఆటోమేషన్ ఒక వరంగా మారింది. క్లౌడ్ ఆధారిత టూల్స్, ఎనర్జీఎఫిషియంట్ పరికరాలను వాడటం ద్వారా ఖర్చులను తగ్గించవచ్చు. టెక్నాలజీ సాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ అవుట్‌పుట్ సాధించేలా ఆపరేషన్లను ఆప్టిమైజ్ చేయాలి. దీనివల్ల ఇన్‌ఫ్లేషన్, టారిఫ్‌ల ప్రభావం వ్యాపారంపై తక్కువగా ఉంటుంది.

### డిజిటల్ పరివర్తన


'ఏఐ వ్యాపారాలను భర్తీ చేయదు కానీ, ఏఐని వాడే వ్యాపారస్తులు దాన్ని వాడని వారిని వెనక్కి నెట్టేస్తారు' అనేది నిజం. ప్రపంచవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయలపై 400 బిలియన్ డాలర్ల పెట్టుబడులు జరుగుతున్న తరుణంలో దీన్ని విస్మరించడం అసాధ్యం. ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ (వస్తు నిర్వహణ)లో ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వాడటం ద్వారా స్టాక్ వృధాను అరికట్టవచ్చు. ఆటోమేటెడ్ ఇన్వాయిసింగ్ (ఆటోమేటెడ్ బిల్లింగ్ విధానం) ద్వారా పేమెంట్స్ త్వరగా వచ్చేలా చూడవచ్చు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సైతం ఏఐ బాట్‌లను వాడి 24/7 కస్టమర్ సపోర్ట్ అందించడం ద్వారా గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడుతున్నాయి.

### మార్కెట్ ట్రెండ్స్

**మార్కెట్ మారుతున్న వేగానికి అనుగుణంగా వ్యాపార సరళి మారకపోతే ఎంతటి పెద్ద బిజినెస్ అయినా కుప్పకూలుతుంది. పర్యావరణ హితమైన పద్ధతులు పాటిస్తున్న బిజినెస్‌ల పట్ల కస్టమర్లు మక్కువ చూపుతున్నారు. ఇది బ్రాండ్ విలువను పెంచడమే కాకుండా దీర్ఘ కాలంలో పన్ను రాయితీలకు కూడా దోహదపడుతుంది. డేటా అనలిటిక్స్ ద్వారా మార్కెట్ మూడ్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైతే బిజినెస్ మోడల్‌ను మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి.**




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




# తెగిపోయిన చెవిని పాదంపై అతికించారు..!

**అనుకోని ప్రమాదాల్లో బాధితులు అవయవాలు కోల్పోవడం సర్వసాధారణం. ఒక్కోసారి కొన్నిటిని కృత్రిమ అవయవాలతో భర్తి చేస్తే.. కొన్ని సున్నితమైన అవయవాల విషయాల్లో అది అస్సలు సాధ్యం కాదు. ఇక్కడ ఒక్క మహిళ కూడా అలానే ఎడమ చెవిని కోల్పోయింది. అయితే దాన్ని చక్కగా తిరిగి ఆమెకు అతికించేందుకు విన్నూతమైన వైద్యవిధానాన్ని ఉపయోగించారు. తెగిన చెవిని తిరిగి అతికించడం కాస్తం కష్టం. అయితే దాన్ని పాడవకుండా కాపాడి మరి అతికించారు. అది ఏవిధంగానే తెలిస్తే.. ఇదేం వైద్య విధానం అని విస్తుపోతారు.**



చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌కు చెందిన సన్ అనే మహిళ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె జుట్టు యంత్రంలో చిక్కుకుంది. ఆ వేగానికి తల ఎడమవైపు చర్మంతో సహా చెవి కూడా పూర్తిగా తెగిపోయింది. దాంతో స్థానికులు హుటాహుటినా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆ ప్రమాదంలో సదరు మహిళకు రక్తనాళాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అందువల్ల చెవిని తిరిగి అమర్చడం క్లిష్టంగా మారింది. అయితే తెగిపోయిన చెవికి గనుక రక్తప్రసరణ అందకపోతే అది కుళ్లిపోయే ప్రమాదం ఉంది. దాంతో వైద్యులు సాహసోపేతమైన నిర్ణయం తీసుకోక తప్పలేదు. తెగిపోయిన చెవి పాడవ్వకుండా ఉండేలా.. పాదం పైభాగానికి అతికించారు. ఎందుకంటే అక్కడ చర్మం పల్చగా ఉండటమే గాక అక్కడి ఉండే రక్తనాళాలు సరిగ్గా చెవి రక్తనాళాల పరిమాణంలోనే ఉంటాయి. ఆ నేపథ్యంలో పాదానికి చెవిని అతికించారు. అక్కడ తలవెంట్రుకల కంటే సన్నగా ఉండే రక్తనాళాలు ఉండటంతో ఈ క్లిష్టమైన మైక్రో సర్జరీకి సుమారు 10 గంటల సమయం పట్టింది. చెవి సురక్షితంగా పెరగడానికి సుమారు ఐదు నెలలు పైనే పట్టింది. ఆ ఐదు నెలలు నిరీక్షణ అనంతరం పాదంపై ఉన్న చెవిని తీసి తల భాగంలో విజయవంతంగా అమర్చారు వైద్యులు. అలాగే ఆ మహిళ తల చర్మాన్ని పునరుద్ధరించడానికి కడుపు నుంచి తీసిన చర్మాన్ని అతికించారు. ఈ సరికొత్త చికిత్సా విధానం విజయవంతం అవడమే గాక సదరు మహిళ సైతం పూర్తిగా కోలుకుంటోంది కూడా. ఇలాంటి శస్త్ర చికిత్సలు చైనాకేం కొత్త కాదు. ఎందుకంటే గతంలో కూడా చైనా వైద్యులు రోగి భుజంపై చెవిని పెంచి అరుదైన రికార్డు క్రియేట్ చేశారు.

# పాక్ ఆర్మీపై దాడి.. 15 మంది మృతి



బలుచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్‌పై విరుచుకపడుతోంది. గత కొద్ది రోజులుగా పాక్‌లోని కీలక ప్రాంతాలపై దాడులు చేసినట్లు ప్రకటించింది. ఈ దాడులలో 15మంది పాకిస్థాన్ సైనికులు మృతిచెందినట్లు బీఎల్ఎఫ్ ప్రకటించింది. ప్రస్తుతం పాకిస్థాన్ పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. సరిహద్దు వెలుపల భారత్, ఆఫ్ఘాన్‌లతో ఆ దేశానికి ఇబ్బందికర పరిస్థితులున్నాయి. ఇవి చాలవన్నట్లు పాకిస్థాన్ ఆర్మీపై బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ దాడులను తీవ్రతరం చేసింది. దీంతో ఆ దేశ ఆర్మీ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇటీవల పాక్‌పై జరిపిన దాడులలో 15 మంది ఆదేశ సైనికులు మృతి చెందినట్లు బిఎల్ఎఫ్ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ తెలిపారు. డిసెంబర్ 23న కేచ్ జిల్లా తేజ్‌బాన్ ఆర్మీ పోస్టుపై జరిపిన దాడిలో ఇద్దరు సైనికులు మృతి చెందినట్లు పేర్కొన్నారు. అనంతరం డిసెంబర్ 25వ తేదీన పంజూర్ జిల్లాలో చైనా పాక్ ఎకనామిక్ కారిడార్ వద్ద మిలటరీ వాహనంపై రిమోట్ కంట్రోల్ ఎక్స్‌ప్లోసివ్స్‌తో దాడులు జరిపామని ఆ ఘటనలో ఆరుగురు పాకిస్థాన్ సైనికులు మృతిచెందగా నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అదే విధంగా పాకిస్థాన్ సెక్యూరిటీ వెహికిల్స్ పై చేసిన దాడిలో ఐదుగురు మృతిచెందగా పలువురు తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు ఈ ఆదివారం మరో దాడి చేసి ఆ దేశ కమ్యూనికేషన్ టవర్స్ ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. పాకిస్థాన్ నుంచి బలూచిస్థాన్ స్వాతంత్ర్యం సాధించేవరకూ ఈ పోరాటాన్ని ఆపేది లేదని బీఎల్ఎఫ్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. 1948లో పాక్‌లో బలూచిస్థాన్ విలీనం చేసే సందర్భంలో ఆ ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అయినప్పటికీ బలంవంతంగా ఆప్రాంతాన్ని పాకిస్థాన్‌లో కలిపారు. అప్పటి నుంచి పాకిస్థాన్ నుంచి స్వతంత్ర్యం కోసం బలూచిస్థాన్ ప్రాంత వాసులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం బలూచ్ ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, ఆప్రాంతాన్ని అభివృద్ధి చేయడం లేదని అక్కడి నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ పై బలుచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులను తీవ్రతర చేసింది.

# పుతిన్ నివాసంపై డ్రోన్ల దాడి..

## రష్యా సంచలన వ్యాఖ్యలు

ఉక్రెయిన్ యుద్ధం ముగింపుకు సంబంధించి జరుగుతున్న దౌత్య ప్రయత్నాల మధ్య రష్యా-ఉక్రెయిన్ మధ్య మాటల యుద్ధం మరోసారి ముదిరింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసిందని మాస్కో సోమవారం తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఘటనను ఉగ్రదాడిగా పేర్కొంది. యుద్ధ విరమణ చర్చలపై తమ వైఖరిని మార్చుకుంటామని రష్యా స్పష్టం చేసింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ప్రకారం... ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం మధ్యలో మాస్కో-సెంట్ పీటర్స్‌బర్గ్ మధ్య ఉన్న నోవ్గొరడ్ ప్రాంతంలోని పుతిన్ అధికారిక నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ మొత్తం 91 డ్రోన్లను ప్రయోగించిందని తెలిపారు. అయితే వాటన్నింటినీ రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.ఈ ఘటనకు ప్రతీకారంగా ఉక్రెయిన్‌లోని కొన్ని లక్ష్యాలను ఇప్పటికే ఎంపిక చేసినట్లు లావ్రోవ్ తెలిపారు. యుద్ధం ముగింపుకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న రష్యా చర్చల వైఖరిని పునఃసమీక్షిస్తాం అని హెచ్చరించారు. ఇదే సమయంలో, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్స్కీ ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. అమెరికా నేతృత్వంలో సాగుతున్న దౌత్య ప్రయత్నాలను భగ్నం చేయడానికే రష్యా ఈ విధమైన ప్రమాదకర ప్రకటనలు చేస్తోందని ఆయన విమర్శించారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న కథనం పూర్తిగా కల్పితం. ఉక్రెయిన్‌పై మరిన్ని దాడులకు, ముఖ్యంగా కీవ్‌పై దాడులకు న్యాయబద్ధత కల్పించేందుకే రష్యా ఈ కథనాన్ని ప్రచారం చేస్తోంది. అలాగే, యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోకుండా తప్పించుకోవడానికీ ఇదే కారణం అని జెలెన్స్కీ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ పరిణామాలతో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న శాంతి ప్రయత్నాలు మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# అగ్నిప్రమాదం..

## 16 మంది వృద్ధులు సజీవ దహనం

**జకార్తా:** ఇండోనేషియా రాజధాని జకార్తాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జకార్తా శివార్లలోని ఒక ప్రైవేట్ వృద్ధాశ్రమంలో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. ఈ దుర్ఘటనలో 16 మంది వృద్ధులు సజీవ దహనమయ్యారని అధికారులు ధృవీకరించారు. ప్రమాదం నుంచి మరో 15 మందిని అక్కడి సహాయక సిబ్బంది సురక్షితంగా బయటకు తరలించారు. తూర్పు జకార్తాలోని 'కాసిహ్ సయాంగ్' వృద్ధాశ్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆశ్రమంలోని వృద్ధులంతా గాఢనిద్రలో ఉండటంతో ప్రాణనష్టం భారీగా జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. తూర్పు జకార్తా అగ్నిమాపక, రక్షణ విభాగం అధిపతి గటోట్ సులేమాన్ ఈ ఘటన గురించి మాట్లాడుతూ.. 'మంటలు వేగంగా వ్యాపించడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. చనిపోయిన 16 మందిలో 10 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. వీరంతా 65 నుండి 85 ఏళ్ల మధ్య వయస్సు గలవారని' ఆయన వివరించారు. ప్రమాదం నుంచి బయటపడిన 15 మందిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయని, వారిని చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రులకు తరలించామని అధికారులు తెలిపారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అధికారుల ప్రాథమిక విచారణ ప్రకారం.. వంటగదిలో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని తెలుస్తోంది. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ బృందం ఆధారాలను సేకరిస్తోంది. వృద్ధాశ్రమంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను పాటించారా లేదా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జకార్తా తాత్కాలిక గవర్నర్ హెరు బూడి హర్తోనో సందర్శించి, మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు.







# మళ్లీ మాతృగడ్డపై ప్రియాంక మోహన్

బహుభాషా నటీనటులకు అడ్వాంటేజ్ ఏమిటంటే ఏదో ఓ భాషలో అవకాశాలు వస్తూనే ఉండటం. అలా 2016లో వంద కథే హెల్లా అనే కన్నడ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయిన శాండిల్ వుడ్ బ్యూటీ ప్రియాంక మోహన్. ఆ తరువాత తెలుగులో శ్రీకారం, నాని 'గ్యాంగ్ లీడర్' వంటి చిత్రాల్లో నటించే అవకాశాలను పొందారు.ఆ తరువాత వెంటనే కోలీవుడ్ ఆహ్వానించింది. ఇక్కడ డాక్టర్, డాన్ వంటి హిట్ చిత్రాల్లో నటించారు. సూర్య సరసన ఎదర్కుమ్ తుణిందవన్, ధనుష్‌తో కలిసి కెప్టెన్ మిల్లర్ చిత్రాల్లో నటించారు. అలా ఈమె చివరిగా ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'జాబిలమ్మ నీకు అంత కోపమా' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్‌లో నటించారు. అదేవిధంగా తెలుగులో ఓజీ చిత్రంలో నటించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రియాంక మోహన్‌ను మళ్లీ మాతృభాష ఆహ్వానించింది. ఈమె చాలా గ్యాప్ తరువాత కన్నడంలో భారీ చిత్రంలో నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, యువ నటుడు డాలీ ధనుంజయ హీరోలుగా నటిస్తున్న తాజా చిత్రం 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్.. ఇందులో నటి ప్రియాంక మోహన్ కథానాయకిగా నటిస్తున్నారు. వైశాక్ జే.ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హేమంత్ ఎం.రావ్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో నటి ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. అది ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తాను ఇంతకుముందు నటించిన చిత్రాలకు పూర్తి భిన్నంగా నటనకు అవకాశం ఉన్న పాత్రను ఈ చిత్రంలో పోషిస్తున్నట్లు ప్రియాంక మోహన్ పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com